**నేటి కందం- నేటికి అందం**

సామమ్మును-రంగముపై
భీమమ్మును జూపెడి నట విద్వన్మణులన్
ప్రేమించి సత్కరింతము
నేమము తోడుత ప్రపంచ నృత్య దినమునన్ !!
(ఏప్రియల్ 29
ప్రపంచ నృత్య దినోత్సవం)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

**చురక**

మాటల్లోనే అధినేతకు
మహాజోషు జవసత్వం
చేతల్లో తిరిగి అదీ
చేపట్టునా ప్రభుత్వం
విలనంటూ నేడు వాళ్ల
విమర్శిస్తే విస్తుపోరా
గతంకన్నా మంచో చెడో
గమనిస్తూ జనం లేరా



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మంగళవారం 29-4-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:212 పేజీలు:6 వెల: రూ.1/-


# కర్రెగుట్టల్లో కూంబింగ్ .. మావోయిస్టుల కోసం ఆగని వేట

**-మందుపాతరల తొలగింపు అతిపెద్ద సవాల్**
**-మూడు బేస్ క్యాంపుల ఏర్పాటుకు సన్నహాలు**
**-మావోయిస్టులకు మద్దతుగా వామపక్షపార్టీల ర్యాలీలు**
**-సీఎంను కలిసిన శాంతి చర్చల కమిటీ నేతలు**
**-సామాజిక సమస్యగా పేర్కొన్న సీఎం రేవంత్**
**-ఆపరేషన్ కగార్ ఆపాలని కేంద్రానికి కేసీఆర్ వినతి**
**-శాంతిచర్చలపై నోరు మెదపని కేంద్ర ప్రభుత్వం**

హైదరాబాద్, ఏప్రిల్ 28:కర్రెగుట్టల్లో ఏడో రోజైన సోమవారం భద్రతా దళాల కూంబింగ్ కొనసాగింది. శనివారం సాయంత్రమే అక్కడికి చేరుకున్న భద్రతా దళాలు అణువణువు పరిశీలన చేస్తున్నాయి. పెద్ద సొరంగంతోపాటు వందకు పైగా బంకర్లు ఉన్నట్లు పోలీసు బలగాలు గుర్తించాయి. బంకర్లలో మావోయిస్టలు ఉన్నారేమో అని వేట కొనసాగిస్తూనే.. అడుగడుగున అమర్చిన మందుపాతరలు పేలే ప్రమాదం ఉందని అచీతూచి అడుగులు వేస్తున్నారు. రైస్ కుక్కర్‌లో బాంబులు అమర్చి.. భారీ విస్ఫోటనం కలిగించి, ప్రాణాలుహరించే బాంబులు అమర్చినట్టు భద్రతా దళాలు గుర్తించాయి. ఇప్పటి వరకు వందకు పైగా మైన్స్ నిర్వీర్యం చేశారు. కొన్ని మందుపాతరలు పేలాయి. బంకర్లలో తలదాచుకున్న మావోయిస్టులను బయటకు రప్పించేందుకు హెలికాప్టర్ ద్వారా భద్రతా దళాలు బాంబులు వేస్తున్నాయి. బాంబుల మోతతో కర్రెగుట్టలు దద్దరిల్లుతున్నాయి.

మూడు బేస్ క్యాంపుల ఏర్పాటు..

కర్రెగుట్టల్లో మూడు బేస్ క్యాంపులు ఏర్పాటు భద్రతా దళాలు సన్నాహాలు చేస్తున్నాయి. పామునూరు ప్రాంతంలో రెండు బేస్ క్యాంపులు, వెంకటాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, ఉసూర్ అటవీ ప్రాంతంలో ఒక బేస్ క్యాంప్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇక్కడ కొంత కాలం సీఆర్‌పీఎఫ్‌తోపాటు కోబ్రా, డీఆర్‌జీ దళాలు ఉండనున్నట్టు తెలుస్తోంది.

రాజకీయ మద్దతు కూడగడుతున్న హరగోపాల్

మావోయిస్టులపై మారణ హోమం ఆపాలని శాంతి చర్చల కమిటీ ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే వివిధ ప్రాంతాలను పర్యటించిన శాంతి చర్చల కమిటీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ హరగోపాల్, వివిధ రాజకీయ పార్టీల మద్దతు కూడగడుతున్నారు. శాంతి చర్చలకు కేంద్రం ముందుకు రావాలని ఖమ్మం, నల్లగొండ ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీలో అన్ని వామపక్ష పార్టీలతోపాటు మేధావులు పాల్గొన్నారు. వరంగల్‌లో హరగోపాల్ ప్రెస్‌మీట్ పెట్టి ఆపరేషన్ కగార్ ఆపేయాలని కోరారు. సీఎం క్యాంప్ ఆఫీస్‌లో సీఎం రేవంత్ రెడ్డికి శాంతి చర్చల కమిటీ వినతి పత్రం ఇచ్చింది. మారణహోమం ఆపాలని, శాంతి చర్చలకు కేంద్రం వచ్చేలా ఒత్తిడి తేవాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో శాంతి చర్చల కమిటీ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, దుర్గాప్రసాద్, జంపన్న, రవి చందర్ ఉన్నారు. కాగా, తమ ప్రభుత్వం సామాజిక కోణంలో ఈ అంశాన్ని చూస్తుందని సీఎం రేవంత్ అన్నారు. గతంలో నక్సల్స్‌తో చర్చలు జరిపిన అనుభవం ఉన్న సీనియర్ నేత జానారెడ్డి, ఇతర మంత్రులతో చర్చించి నిర్ణయాన్ని తీసుకుంటామని తెలిపారు.

జానారెడ్డితో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, హోంశాఖ మాజీ మంత్రి జానారెడ్డి నివాసానికి సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారు. ఆపరేషన్ కగార్, శాంతి చర్చలు, కాల్పుల విరమణ తదితర అంశాలపై చర్చించారు. శాంతి చర్చల కమిటీ ముఖ్యమంత్రిని కలిసిన నేపథ్యంలో సోమవారం ఉదయం జానారెడ్డితో సీఎం భేటీ చర్చనీయాంశమైంది.

మావోయిస్టులతో చర్చలు జరపాలి : కేసీఆర్

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం, కేసీఆర్ కోరారు. ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో ఆపరేషన్ కగార్ పేరుతో ప్రాణాలు తీస్తున్నారని.. అది సరైంది కాదన్నారు. బలగాలున్నాయని చంపుకొంటూ పోవడం ప్రజాస్వామ్యం అనిపించుకోదన్నారు. ఆపరేషన్ కగార్‌ను ఆపేయాలని, చర్చలకు పిలవాలని కోరారు. కాగా, ప్రజా ఆమోదం మేరకు ఆపరేషన్ కగార్‌ను ఆపాలని తీర్మానం చేసి ఢిల్లీకి పంపుతున్నట్లు కేసీఆర్ తెలిపారు.

మావోయిస్టుల వినతి.. పట్టించుకోని కేంద్రం

ఆపరేషన్ కగార్ ఆపేయాలని, శాంతికోసం తాము సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు కేంద్రాన్ని కోరుతున్నారు. కాగా, కర్రెగుట్టలను స్వాధీనం చేసుకోవడానికి భద్రతా దళాలు మరింత దూకుడుగా ముందుకు వెళ్తున్నాయి. ఈ క్రమంలో మావోయిస్టు నేత రూపేస్ పేరుతో మరో లేఖ విడుదలైంది. శాంతి చర్చలకు సిద్ధమని, కర్రెగుట్టల్లో ఆపరేషన్ ఆపేయాలని అందులో కోరారు. అయినా ఇవేవీ పట్టించుకుండా కేంద్ర మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ముందుకు వెళ్తోంది.

# మానవ వనరుల అభివృద్ధి కేంద్రం వైస్ ఛైర్ పర్సన్‌గా శాంతి కుమారి

హైదరాబాద్, ఏప్రిల్ 28: మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం వైస్ చైర్ పర్సన్ గా సీనియర్ ఐఏఎస్ అధికారిణి శాంతికుమారిని నియమించారు.. ప్రస్తుతం ఆమె రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు.. ఆమె ఈ నెల 30వ తేదిన పదవీ విరమణ చేయనున్నారు.. ఈ నేపథ్యంలోనే ఆమెకు ఎంసిఆర్ హెచ్ ఆర్డీ వైస్ ఛైర్మన్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.. ఆమె నియామకం మే ఒకటో తేది నుంచి అమలులోకి వస్తుందని పేర్కొంది.. కాగా కొత్త ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారావును ప్రభుత్వం నియమించింది.. ఆయన కూడా మే ఒకటో తేదిన రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

# రేవంత్ రెడ్డితో కొత్త సిఎస్ మర్యాదపూర్వక భేటి



హైదరాబాద్, ఏప్రిల్ 28:తెలంగాణ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె. రామకృష్ణ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని నేడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు రేవంత్ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు? కాగా, ప్రస్తుత సిఎస్ శాంతికుమారి ఈ నెల 30వ తేదిన పదవీ విరమణ చేయనున్నారు.. ఆమె స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం రామ కృష్ణారావును చీఫ్ సెక్రటరీగా నియమించింది.. ఆయన వచ్చే నెల ఒకటో తేదిన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు..

# రఫేల్ మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలుకు ఫ్రాన్స్ దేశంతో భారత్ ఒప్పందం

న్యూ ఢిల్లీ (ఎక్స్ ప్రెస్ న్యూ స్);భారత సైనిక దళాల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రఫేల్ మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి ఫ్రాన్స్ దేశంతో భారత్ ఇటీవలే ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఆ ఒప్పందంపై ఇరు దేశాలూ సంతకాలు చేశాయి. భారత్, ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య కుదిరిన ఈ భారీ ఒప్పందం విలువ 7.6 బిలియన్ డాలర్లు. అంటే భారత కరెన్సీలో రూ.64,000 కోట్లన్నమాట .ఒప్పందంలో భాగంగా భారత నావికాదళానికి ఫ్రాన్స్ నుంచి 22 సింగిల్ సీటర్, నాలుగు టు సీటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు రానున్నాయి. దీంతోపాటు వీటి నిర్వహణ, స్పేర్లు, లాజిస్టికల్ సపోర్ట్, శిక్షణకు సంబంధించిన అంశాలు సకాలంలో పూర్తయ్యేలా ఫ్రాన్స్ ప్రభుత్వమే చూసుకుంటుంది. వాయుదళ శక్తిని పటిష్టం చేసే లక్ష్యంతో రఫేల్ యుద్ధ విమానాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నది. శక్తివంతమైన ఆధునిక ఆయుధ వ్యవస్థలను కలిగి ఉండే రఫేల్ యుద్ధ విమానాలు భారత నౌకాదళ పోరాట శక్తిని బలోపేతం చేయనున్నాయి. నాలుగేళ్లలో రఫేల్ యుద్ధ విమానాల సరఫరా ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇక ఒప్పందం ప్రకారం.. తొలిబ్యాచ్ 2029లో రావొచ్చని.. 2031 నాటికి మొత్తం చేతికొచ్చే అవకాశాలున్నాయి.

# ప్రధానితో రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ భేటీ

న్యూ ఢిల్లీ ఏప్రిల్ 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జమ్మూకశ్మీర్ లో ఉగ్రవాదుల దాడి అనంతరం ప్రస్తుతం జమ్మూకశ్మీర్ క్రమంగా కోలుకుంటోంది. కేంద్ర రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ ప్రధానిని కలిసి ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న భద్రతా పరిస్థితిని పూర్తిగా వివరించారు. ఏప్రిల్ 22న 26 మందిని బలిగొన్న టెర్రరిస్ట్ ల దాడి వెనుకఉన్న కుట్రదారులను శిక్షించేందుకు భారత ప్రభుత్వం ఆలోచిస్తున్న తరుణంలో ఈ బ్రీఫింగ్ జరిగింది. ఈ దాడికీ, సరిహద్దు ఆవలి దేశంతో గల సంబంధాలు కీలకం అని పేర్కొంటూ, భయంకరమైన టెర్రర్ దాడి పట్ల దేశంలోన, విదేశాల లోనూ విస్తృతతంగా వ్యక్తమైన తీవ్ర ఆగ్రహం నేపథ్యంలో దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని భారత్ స్పష్టంచేసింది.ప్రధానితో రక్షణమంత్రి భేటీ పై అధికార ప్రకటన ఏదీ వెలువడలేదు. పహల్గామ్ దాడికి పాల్పడిన ఉగ్రవాదులు, కుట్రదారులకు గట్టిగా శిక్ష తప్పదని ప్రధాని మోదీ మన్ కా బాత్ కార్యక్రమంలో స్పష్టంచేశారు. టెర్రరిస్ట్ లపై పోరులో మొత్తం ప్రపంచం 140 కోట్ల భారతీయులకు అండగా నిలుస్తోందని ప్రధాని అన్నారు.

# హైదరాబాదులోని పాకిస్తానీయులకు లీవ్ ఇండియా పేరుతో అధికారులు నోటీసులు

హైదరాబాద్ ఏప్రిల్ 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ పాక్ పై దౌత్య దాడికి దిగింది. ఇందులో భాగంగా భారత్ లో ఉన్నటు వంటి పాక్ పౌరులను ఆ దేశానికి పంపించేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో హైదరాబాదులోని పాకిస్తానీయులకు లీవ్ ఇండియా పేరుతో అధికారులు నోటీసులు అందజేశారు. హైదరాబాదులో మొత్తం 230 మంది పాకిస్తానీయులు ఉన్నట్లు గుర్తించారు. 199 మందికి లాంగ్ టర్మ్ వీసాలు, 31 మందికి షార్ట్ టర్మ్ వీసాలు ఉన్నాయని గుర్తించారు. షార్ట్ టర్మ్ వీసాలు ఉన్న ఎనిమిది మందికి దేశం విడిచిపోవాలని నోటీసులు జారి చేశారు. మెడికల్ వీసాలు తీసుకున్న వారికి ఈ నెల 29 వరకు గడువు విధించారు. పాకిస్తానీయులు తెలంగాణ రాష్ట్రం విడిచి వెళ్లిపోవాలని డిజిపి డాక్టర్ జితేందర్ ఆదేశాలు జారీ చేశారు. షార్ట్ టర్మ్ వీసాలు ఉన్నవారు దేశం విడిచి వెళ్లాలని ఆదేశించారు. ఇమ్మిగ్రేషన్‌అధికారులు అందించిన వివరాల ప్రకారం హైదరాబాద్ సహా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 230 మంది ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.వీరిలో సిటీ కమిషనరేట్ పరిధిలో పాతబస్తీలోని వివిధ ప్రాంతాల్లో 156 మందికి పైగా నివాసం ఉంటున్నట్లు తెలిసింది. ఇందులో లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ సహా ఇతర వీసాలు కలిగి ఉన్న వారి కోసం పోలీసులు గాలిస్తు న్నారు. పాకిస్తాన్‌లో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులు, బంధువుల వివరాలతో డేటాను రికార్డ్ చేస్తున్నారు. ఇమ్మిగ్రేషన్ అధికారుల అందించిన పాకిస్తానీయుల డేటా ఆధారంగా ఆయా అడ్రసుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్థానిక పోలీసులు, స్పెషల్ బ్రాంచ్‌సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలోనే వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమం గా నివాసం ఉంటున్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సోమవారం నుంచి సోదాలు తీవ్రతరం చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. పర్మినెంట్‌వీసాలు కలిగి ఉన్న వారి పాస్‌పోర్టులపై స్టాంపింగ్ ఆధారంగా వారి ట్రావెల్ హిస్టరీని సేకరించనున్నారు. ఈ క్రమంలోనే ఫారినర్స్ రీజినల్‌రిజిస్ట్రేషన్ ఆఫీసు (ఎఫ్ఆర్ఆర్ఒ) రికార్డుల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. పర్మినెంట్‌వీసాలపై వచ్చిన వారు ప్రస్తుతం ఎలాంటి పనులు చేస్తున్నారు. వారి ఆర్థిక పరిస్థితులు, పాస్‌పోరులపై స్టాంపింగ్ సహా ప్రయాణ వివరాలను తెలుసుకుంటున్నారు. దీంతో పాటు పాకిస్తానీయులను దేశం నుంచి పంపించేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించే విధి విధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఓ పోలీస్ ఉన్నతాధికారి వెల్లడించారు. రోహింగ్యాలపై కూడా నిరంతర నిఘా కొనసాగు తోందని స్పష్టం చేశారు.

# రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మ భూషణ్ అవార్డ్ అందుకున్న బాలయ్య



న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: 2025 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ పురస్కారాల ప్రదానోత్సవం సోమవారం (ఏప్రిల్ 28) ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా జరిగింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సినిమా రంగానికి గాను విశేష సేవలు అందించిన ప్రముఖులకి ప్రతిష్టాత్మక అవార్డులు అందించారు. ప్రముఖ నటుడు, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ ‘పద్మభూషణ్’ అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా బాలయ్య పద్మ అవార్డుల కార్యక్రమానికి హాజరయ్యారు. కొడుకు, కూతుళ్లు, అల్లుళ్లతో కలిసి బాలయ్య ఈ కార్యక్రమానికి హాజరు కావడం విశేషం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఎంపికైన బాలయ్య, రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారాన్ని స్వీకరించారు. 110కి పైగా చిత్రాల్లో నటించడంతో పాటు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ఛైర్మన్‌గా కూడా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న క్రమంలో బాలయ్యకి ఈ అవార్డ్ దక్కింది. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి కుమారుడు మోక్షజ్ఞ, కూతురు తేజస్విని, భార్య వసుందర, మంత్రి నారా లోకేష్ దంపతులు హాజరయ్యారు.కోలీవుడ్ హీరో అజిత్‌కి సైతం పద్మ విభూషణ్ అవార్డ్ అందించారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.

పద్మ పురస్కారానికి ఎంపికైన సమయంలో అజిత్ భావోద్వేగానికి గురైన విషయం మనకు తెలిసిందే. ఈ శుభవార్తని వినేందుకు నా తండ్రి ఉండి ఉంటే బాగుండు అని అజిత్ కాస్త ఎమోషనల్ అయ్యారు.సినీ రంగంలోనే కాకుండా రేసింగ్‌లోను అజిత్ కి ప్రావీణ్యం ఉంది.

కాగా, జనవరి 25న గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 2025 పద్మ పురస్కారాలను ప్రకటించిన విషయం తెలిసిందే. మొత్తం 139 మంది ఈసారి అవార్డుల కోసం ఎంపికయ్యారు. వీరిలో 113 మందికి పద్మశ్రీ, 19 మందికి పద్మభూషణ్, ఏడుగురికి పద్మవిభూషణ్ పురస్కారాలు లభించాయి.

# ప్రధాన, రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు పూర్తి

హైదరాబాద్, ఏప్రిల్ 28: ప్రధాన, రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు పూర్తి చేసింది. ఒక చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్, 7 గురు ఇన్ఫర్మేషన్ కమిషనర్లను నియమించనున్న ప్రభుత్వం ఈ మేరకు ఆమోదం కోసం గవర్నర్ కు పంపింది.

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తరవాత ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది.

కాగా ప్రధాన సమాచార కమిషనర్ గా ఐఎఫ్ఎస్ అధికారి చంద్రశేఖర్ రెడ్డిని నియమించినట్లు తెలిసింది. ఇక మరో ఏడుగురిని ఇన్ఫర్మేషన్ కమిషనర్లుగా నియమిస్తూ ప్రభుత్వం గవర్నర్ ఆమోదానికి పంపింది. కమిషనర్లలో సీనియర్ జర్నలిస్టులకు అవకాశం కలిపించారు.

వారిలో పీవీ శ్రీనివాస్ రావు. అయోధ్య రెడ్డి బోరెడ్డి, కప్పర హరిప్రసాద్, పీఎల్ఎన్ ప్రసాద్, రాములు, వైష్ణవి, పర్వీన్ మోహిసిన్ లు ఉన్నారు. వీరి నియామకాన్ని ఫైనల్ చేస్తూ కాసేపట్లో ఉత్తర్వులు వెలువడనున్నాయి.

# దుష్ట శక్తుల నుండి విముక్తి కోసం.. దత్తగిరిలో మహా రుద్రయాగం ప్రారంభం

మెదక్, ఏప్రిల్ 28:దేశాన్ని పట్టి పీడిస్తున్న దుష్ట శక్తుల నుండి విముక్తి కలిగించాలని కోరుతూ మహా రుద్రయాగాన్ని ప్రారంభించినట్లు దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి మహామండలేశ్వర్ డాక్టర్ 1008 సిద్దేశ్వరానందగిరి మహారాజ్, వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్ తెలిపారు.

ఇవాళ వేద మంత్రోచ్చారణల మధ్య వైదిక పాఠశాల విద్యార్థులు ఈ మహా రుద్రయాగ క్రతువును ప్రారంభించారు. గణపతి పూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, అనంతరం ఉదయం 10:30గంటలకు ప్రారంభమైన యాగం మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతితో ముగిసింది.

ప్రతీ రోజు యజ్ఞం నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. దేశానికి దుష్ట శక్తుల నుండి విముక్తి లభించే వరకు రుద్ర యజ్ఞం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఝరాసంగం ఎస్సై నరేష్ పాల్గొని పూర్ణాహుతి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు.

# వారి ప్రాణాలను అడ్డంపెట్టుకుని రాష్ట్ర హోదా అడగబోను : జమ్మూకశ్మీర్ సీఎం





న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: పహల్గాంలో అతిథులను కాపాడుకోవడంలో తాను విఫలమయ్యానని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు అసెంబ్లీ వేదికగా ఆయన ప్రకటన చేశారు. అయితే ఆ 26 మంది ప్రాణాలను అడ్డంపెట్టుకొని తాను రాష్ట్రహోదాను డిమాండ్ చేయబోనని ఆయన హామీ ఇచ్చారు. జాతి తీవ్ర వేదనల్లో ఉన్నప్పుడు ఆ డిమాండ్ సరికాదని, మరేదైనా రోజు ఆ డిమాండ్ లేవనెత్తుతానని చెప్పారు.

పహల్గాం ఉగ్రదాడిపై చర్చించేందుకు జమ్మూకశ్మీర్ అసెంబ్లీ సోమవారం అత్యవసరంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. ‘ఇలాంటి దాడులు గతంలో చాలా చూశాం. కానీ బైసరన్‌లో ఇంత పెద్ద స్థాయిలో దాడి చేయడం మాత్రం 21 ఏళ్లలో ఇదే తొలిసారి. మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ఎలా క్షమాపణలు చెప్పాలో కూడా తెలియడం లేదు. రాష్ట్రానికి వచ్చిన పర్యాటకులను సురక్షితంగా తిరిగి పంపాల్సిన బాధ్యత మాదే. నేను ఆ పని చేయలేకపోయాను. క్షమాపణలు చెప్పేందుకు నా వద్ద మాటలు కరవయ్యాయి’ అని అన్నారు.

పహల్గాం దాడి తర్వాత తాపే ఏ ముఖం పెట్టుకొని రాష్ట్రహోదా కోసం డిమాండ్ చేయాలని ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు. నా రాజకీయాలు అంత చౌకబారువి కాదని చెప్పారు. గతంలో రాష్ట్రహోదా అడిగామని, భవిష్యత్తులో కూడా అడుగుతామని అన్నారు. కానీ, ఇప్పుడు 26 మంది అమాయకులు చనిపోయారని, ఇలాంటి సమయంలో రాష్ట్ర హోదా ఇవ్వండని కేంద్రాన్ని అడగడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ప్రజలు తమకు మద్దతిస్తే తీవ్రవాదం, ఉగ్రవాదం అంతమవుతాయని ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఇది అందుకు ఆరంభమని చెప్పారు. ఈ ఉద్యమానికి హాని కలిగించేది ఏదీ మాట్లాడకూడదు, చేయకూడదని అన్నారు. తాము మిలిటెన్సీని తుపాకులతో అదుపు చేయగలమని, కానీ, తమకు ప్రజల మద్దతు అవసరమనిని అబ్దుల్లా అసెంబ్లీలో చెప్పారు. రాష్ట్ర ముఖ్యమం త్రిగా, పర్యాటక శాఖ మంత్రిగా తాను వారిని కాపాడలేకపోయానని అన్నారు.

కాగా ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో సేదతీరుతున్న 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చిచంపారు. ఒక్కొక్కరిని మతం అడిగి మరీ ఈ దారుణానికి ఒడిగట్టడం సంచలనంగా మారింది. మృతుల్లో 25 మంది భారతీయులు, ఒక నేపాలీ ఉన్నారు.

# ఉత్తర కొరియా సైనికులకు థ్యాంక్స్ చెప్పిన పుతిన్.. కిమ్‌ను కలవాలనుకుంటున్న ట్రంప్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: ఉత్తర కొరియాసైనికులకు, ఆ దేశాధినేత కిమ్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ థ్యాంక్స్ చెప్పారు. ఉక్రెయిన్ దళాల్ని తిప్పికొట్టడంలో ఉత్తర కొరియా సైనికులు సహకరించినట్లు పుతిన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. కుర్స్క్ బోర్డర్ ప్రాంతం విముక్తి అయిన నేపథ్యంలో రష్యా మిలిటరీ ప్రకటన చేసింది. గత ఆగస్టులో ఉక్రెయిన్ ఈ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నది. అయితే అక్కడ చేపట్టిన ఆపరేషన్‌లో ఉత్తర కొరియా దళాలు పాల్గొన్నాయని, ఆ ప్రాంతాన్ని తిరిగి చేజిక్కించుకున్నట్లు పుతిన్ చెప్పారు.నార్త్ కొరియా మిత్రులు సంఘీభావం, న్యాయం, స్నేహపూర్వకంగా పోరాడినట్లు పుతిన్ తెలిపారు. నార్త్ కొరియా సైనికులు చూపిన హీరోయిజాన్ని, స్ఫూర్తి, సాహసాన్ని అభినందిస్తున్నట్లు వెల్లడించారు. తమ దేశాన్ని వాళ్లు స్వదేశంగా భావించి డిఫెండ్ చేశారన్నారు. రష్యా సైనికులతో కలిసి వాళ్లు భుజం భుజం కలిపారన్నారు. వాళ్ల డ్యూటీని చాలా గౌరవప్రదంగా చేసి వైభవాన్ని తీసుకువచ్చినట్లు కొరియా సైనికుల్ని పుతిన్ కొనియాడారు. ప్రాణాలు కోల్పోయిన ఉత్తర కొరియా సైనికులను తగిన రీతిలో గుర్తించనున్నట్లు చెప్పారు.

మరో వైపు ఉత్తర కొరియా నేత కిమ్ జాంగ్ ఉన్‌తో .. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చర్చలు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. నార్త్ కొరియాతో కొత్త వ్యూహాన్ని అనుసరించాలని ట్రంప్ టీమ్ భావిస్తున్నట్లు స్పష్టం అవుతోంది. గతంలో నిర్వహించిన దౌత్యపరమైన చర్చలను మళ్లీ ప్రారంభించాలని ఆలోచిస్తున్నారు. ట్రంప్, కిమ్ భేటీ కోసం వైట్‌హౌజ్ ప్లాన్ చేస్తున్నట్లు కూడా సంకేతాలు అందుతున్నాయి.

# అమెరికా చెస్ పోటీల్లో విజేతగా నిలిచిన హైదరాబాదీ!

హైదరాబాద్, ఏప్రిల్ 28: అమెరికాలో నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ యువకుడు సత్తా చాటాడు. అమెరికాలోని చికాగో ఆంధ్రా అసోసియేషన్ (సీఏఏ) 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చెస్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో హైదరాబాద్‌లోని మౌలాలి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన మనోజ్ చంద్ర కొంపల్లి పాల్గొన్నాడు. ఈ చెస్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచాడు.

కాగా, ఈ చెస్ టోర్నమెంట్‌లో మనోజ్ చంద్ర విజేతగా గెలవడం వరుసగా ఇది రెండోసారి కావడం గమనార్హం. ఈ సందర్భంగా మనోజ్ చంద్రను చికాగా ఆంధ్రా అసోసియేషన్ ప్రతినిధులు, డైరెక్టర్ స్పోర్ట్స్ నరసింహారావు అభినందించారు. అతనికి చెస్ టోర్నమెంట్ ట్రోఫీని అందజేశారు. ఇక సీఏఏ వేడుకల సందర్భంగా చికాగోలోని నేపర్‌విల్లేలో నిర్వహించిన ఈ చెస్ టోర్నమెంట్‌కు పెద్ద సంఖ్యలో తెలుగువాళ్లు హాజరయ్యారు.

# మానవ సమాజాన్ని ఐక్యం చేసే సంపద కళ మాత్రమే !

## (29 ఏప్రిల్ "అంతర్జాతీయ నాట్య దినోత్సవం" సందర్భంగా)

నాట్యం ఓ విశ్వ భాష. ప్రపంచ ప్రజలను ఏకం చేయగల శక్తివంతమైన సాంస్కృతిక సాధనం. నాట్యాన్ని మెచ్చని నరులుండరు. నాట్యం చేయడానికి వేదికను ఎక్కడం లేదా నాట్యాన్ని వీక్షించడానికి కళాభిమానిగా ప్రేక్షకుల్లో ఉంటూ కళను ఆస్వదించడం తరుచుగా చేస్తున్నాం. ఒక మహాద్భుత అనుభూతిని, ప్రేరణను, అమితానందాన్ని అందిస్తున్నది నాట్య కళ. వివిధ ప్రాంతాల, దేశాల ప్రజలు వేరు వేరు నాట్య రూపాలను ప్రోత్సహిస్తున్నారు లేదా ప్రచారం చేస్తూ ప్రదర్శనలు ఇస్తున్నారు. నాట్య కళ ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఏట 29 ఏప్రిల్ రోజున విశ్వవ్యాప్తంగా "అంతర్జాతీయ నాట్య దినోత్సవం" లేదా "ఇంటర్నేషనల్ డాన్స్ డే"ను యునెస్కోతో కలిసి ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా 1982 నుంచి నిర్వహించడమ ఆనవాయితీగా మారింది. ప్రపంచ ప్రఖ్యాత నాట్య కళాకారులు జీన్స్ జార్జెస్ నవ్వేరీ జన్మదినం సందర్భంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు.

నాట్యకళకు 9,000 ఏండ్ల చరిత్ర:

స్వయం ప్రకటనకు నిలువెత్తు నిదర్శనం నాట్యం మాత్రమే. దాదాపు 9,000 ఏండ్ల క్రితమే ప్రారంభమైన నృత్య కళ నేడు అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రజల మన్నలు పొందుతున్నది. సాంస్కృతిక సరిహద్దులు చెరుపుతూ విశ్వవ్యాప్తం కావడం, వైవిధ్యభరితమైన మానవాళిని ఒకే వేదికపైకి తీసుకురావడం, కళాభిమానులకు మానసిక ప్రశాంతతను చేకూర్చడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన నాట్యకళ ఆనందాలు పంచుతూ దేహం, మనసు, హృదయం, ఆత్మలకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. నాట్యం ద్వారా వ్యక్తిగత అభినయం, శరీర భాగాల సమన్వయం, భావోద్వేగాలను ఆకర్షణీయంగా వ్యక్తీకరించడం, మానసిక ఒత్తిడిని తగ్గించడం జరుగుతుంది.

భారతంలో వైవిధ్యభరిత నాట్యకళ:

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తున్న సువిశాల భారతంలో ఎన్నో శాస్త్రీయ, జానపద నాట్యాలు ప్రజాదరణను పొందాయి. భారత సంగీత అకాడమీ గుర్తించిన ఎనిమిది శాస్త్రీయ నృత్య కళల్లో భరతనాట్యం, కూచిపూడి, కథకుల, కథక్, ఒడిసి, మోహినీయాట్టం, మణిపురి, సత్రియాలు వస్తాయి. భారత దేశవ్యాప్తంగా 29 జానపద నాట్య కళారూపాలను గుర్తించినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో బహుళ ప్రచారం పొందిన జానపద నాట్యాల్లో విలాసిని, భామాకలాపం, వీర నాట్యం, డప్పు, తప్పెటగుళ్లు, లంబాడి, ధింసా, కోలాటం, పేరిణి, బుర్ర కథ, గుస్సాడి, చిందుల బాగోతం, బుట్ట బొమ్మలు, బోనాలు లాంటివి ఉన్నాయి.

డిజిటల్ యుగంలో నాట్య కళను సజీవంగా కొనసాగించడానికి ప్రభుత్వాలు, రాజకీయ వ్యవస్థలు, స్వచ్ఛంద సంస్థలు చొరవను చూపాలి. నాట్యకళను యువతలో ప్రోత్సహించాలి. నాట్య కళాకారులను తగు రీతిలో గుర్తించడం, చిన్నారులకు నాట్య శిక్షణ ఇప్పించడం, నాట్య కళాశాలలను ఏర్పాటు చేయడం, నాట్య శిక్షణ ఇచ్చే గురువులను ప్రోత్సహించడం, నాట్య కళ పట్ల సమాజంలో చిన్న చూపును రూపుమాపడం లాంటి చర్యలు సత్వరమే తీసుకొని మన నాట్యకళా వారసత్వ సంపదను రాబోయే తరానికి అందించే ప్రయత్నాలు జరగాలి.

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# భూభారతి చట్టం 2025 చారిత్రాత్మకం, సులభతరం, పారదర్శకమైనది...

### అద్వైత్ కుమార్ సింగ్, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ భూ సమస్యను క్షేత్రస్థాయిలోనే పరిష్కార మార్గం చూపే భూభారతి చట్టం




మహబూబాబాద్, ఏప్రిల్ 28:(నేటి నిజం ప్రతినిధి): చారిత్రాత్మకం, సులభతరం, పారదర్శకంమైనది, నూతన భూభారతి చట్టం 2025, సామాన్యులకు బడుగు, బలహీన వర్గాల రైతులు, ప్రజలందరికీ న్యాయమైన సత్వర సేవలు,భూ సమస్యను క్షేత్రస్థాయిలోనే పరిష్కార మార్గం చూపే చట్టమే భూభారతి చట్టం అని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భూభారతి - చట్టం 25 పై అవగాహన రెవెన్యూ సదస్సు సోమవారం పెద్ద వంగర, తొర్రూరు మండలాల రైతు వేదికలలో నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కే.వీర బ్రహ్మాచారి, రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్ హాజరై తెలంగాణ గీతం ఆలపించి, పిపిటి చదివి రైతులకు, ప్రజలకు, హాజరైన వారందరికీ భూభారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టం-2025 పై అవహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చారిత్రాత్మకమైన సులభతరమైన సామాన్య రైతులు, ప్రజలు బడుగు బలహీన వర్గాల భూ సమస్యల పరిష్కారానికి సరికొత్త నూతన భూ భారతీ చట్టం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.గతంలో ధరణి వలన రెవెన్యూ అధికారులు సమస్యలను పరిష్కరించలేకపోయారని, సామాన్య ప్రజలు సివిల్ కోర్టు తదితర మార్గాల ద్వారా న్యాయం పొందలేక అంతవరకు వెళ్ళే స్థితిలో ఉండేవారు కాదని తద్వారా సమస్యలు అలాగే మిగిలిపోయేవి అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన భూభారతి ఆర్.ఓ.ఆర్ చట్టం-2025 ద్వారా ప్రతి భూ సమస్యకు పరిష్కార మార్గాలు సెక్షన్ల వారిగా ఏర్పాటు చేయడం జరిగిందని తద్వారా ఏదైనా సమస్య వచ్చినప్పుడు దరఖాస్తులు స్వీకరించి ఇరు వర్గాల వారికి నోటీసులు జారీ చేసి క్షేత్రస్థాయిలోనే విచారణ చేసి సమస్యను పరిష్కరించడం కోసం తహసిల్దార్, రెవిన్యూ డివిజనల్ అధికారి, కలెక్టర్ స్థాయిలలో నిర్ణీత సమయంలో రైతుల న్యాయం జరిగేలా చట్టం రూపొందించారని, ప్రస్తుతం అన్ని స్థాయిలలో రైతులకు అప్పీల్ (దరఖాస్తులు ) చేసుకునే అవకాశం ఈ నూతన చట్టంలో ఉందని అన్నారు. అందుకోసం ప్రభుత్వం క్షేత్రస్థాయిలో గ్రామ పరిపాలన అధికారులను, సర్వేయర్లను నియమించడం కోసం చర్యలు తీసుకుంటుందన్నారు. తద్వారా క్షేత్రస్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకోవడం కోసం పకడ్బందీ ప్రణాళికా ప్రకారం ముందుకు సాగుతున్నామని రైతులు, ప్రజలు, అన్ని వర్గాల వారు ఈ నూతన రెవెన్యూ చట్టం పై అవగాహన పెంచుకొని వారి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మాచారి మాట్లాడుతూ గత ధరణి కాలంలో న్యాయమైన చిన్న చిన్న వారసత్వ, హద్దుల పంచాయితీలు, పేరు మార్పు, చేర్పులు తదితర భూ సమస్యలను పరిష్కరించే అధికారము రెవెన్యూ అధికారులకు లేకుండా ఉండేదని, గ్రామస్థాయిలో ఎవరు రెవెన్యూ రికార్డులు నిర్వహణ సిబ్బంది లేకపోవడం సమస్యలు అనేకం అలాగే మిగిలిపోయాయి అని గుర్తుకు చేశారు. ప్రస్తుత రెవెన్యూ చట్టం ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు.గ్రామస్థాయిలో గ్రామ పాలన అధికారి, సర్వేయర్లు నియమించడం ద్వారా గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉంటుందని, సరిహద్దులు, భూ వివరాలు, మ్యాపు వివరాలు తదితర రికార్డులు అందుబాటులో ఉంటాయని అన్నారు.దరఖాస్తు చేసుకున్న రైతు యొక్క సమయం పరిష్కార సమయాలను నూతన చట్టంలో సెక్షన్ల వారీగా పూర్తిగా వివరించడం జరిగిందని అన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భూభారతి చట్టం ద్వారా అందరికీ వేగవంతమైన న్యాయమైన సేవలు అందుతాయన్నారు.గత ధరణి, ప్రస్తుత భూభారతి కేంద్ర చట్టం వ్యత్యాసాలపై రైతులకు సవివరంగా ఆయన వివరించారు,ఈ రెవెన్యూ సదస్సులో ఏడి ఎన్ఎల్ఆర్ ఏ.నరసింహమూర్తి, స్థానిక తహసిల్దార్లు మహేందర్, శ్రీనివాస్ ఎంపిడిఓలు బోడేపూడి వేణుమాధవ్, పూర్ణచందర్ రెడ్డి, ఎడిఏ విజయ్ చంద్ర, ఆర్ఐ లస్కర్, వ్యవసాయ అధికారి స్వామి, ఏపీవో వినయ్, ఎపిఎం రమణాచారి సంబంధిత అధికారులు పాల్గొన్నారు .

# మీడియా, గేమింగ్, వినోద రంగాల్లో రంగాల్లో ఆవిష్కర్తలు..

## తమ ప్రతిభను ప్రదర్శించడానికి వేవ్స్ అపూర్వ అవకాశం: ప్రధాని

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:ఉద్యోగ మేళాను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ.. వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో కొత్తగా నియమితులైన వారికి 51,000కి పైగా నియామక పత్రాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందించారు. భారత ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో యువతకు కొత్త బాధ్యతలు ప్రారంభమయ్యాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, అంతర్గత భద్రతను పెంపొందించటం, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనకు దోహదపడటం, కార్మికుల జీవితాల్లో పరివర్తనాత్మక మార్పులు తీసుకురావడం వీరి బాధ్యతలని పేర్కొన్నారు. వారు తమ బాధ్యతలను నిర్వర్తించే విషయంలో చూపించే చిత్తశుద్ధి.. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే దిశగా భారత్ చేస్తున్న ప్రయాణంపై సానుకూల ప్రభావాన్ని చూపుతుందని ప్రధానంగా పేర్కొన్నారు. విధుల నిర్వహించే విషయంలో ఈ యువత అత్యంత అంకితభావంతో ఉంటారని విశ్వాసం వ్యక్తం చేశారు.

''ఏ దేశ పురోగతికైనా, విజయానికైనా పునాది దాని యువతలోనే ఉంటుంది. యువత జాతి నిర్మాణంలో చురుకుగా పాల్గొన్నప్పుడు, దేశం వేగవంతమైన అభివృద్ధితో ప్రపంచ వేదికపై గుర్తింపును పొందుతుంది'' అని ప్రధానంగా వ్యాఖ్యానించారు. భారత యువత తమ కృషి, ఆవిష్కరణల ద్వారా మన అపారమైన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతున్నారని.. దేశ యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం అన్ని వేళలా కృషి చేస్తోందన్నారు. స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలు యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయన్నారు. వీటి ద్వారా భారత యువత తమ ప్రతిభను ప్రదర్శించుకునేందుకు ప్రభుత్వం ఒక బహిరంగ వేదికను అందిస్తోంది. వీటన్నింటి ఫలితంగా ఈ దశాబ్దంలో భారత యువత సాంకేతికత, డేటా, ఆవిష్కరణలలో దేశాన్ని అగ్రగామిగా నిలిపారని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో పరివర్తనాత్మక మార్పులు తీసుకొచ్చిన యూపీఐ, ఓఎన్‌డీసీ, జీఈఎం (గవర్నమెంట్ ఈ-మార్కెట్ ప్లేస్) వంటి ప్లాట్‌ఫామ్.. యువత ఎలా నాయకత్వం వహిస్తున్నారో తెలియజేస్తోందన్నారు. తక్షణ డిజిటల్ లావాదేవీల్లో భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే ముందంజలో ఉందని, ఈ ఘనతలో ఎక్కువ భాగం యువతకు దక్కుతుందన్నారు.

'ఈ బడ్జెట్‌లో ప్రకటించిన తయారీ రంగ మిషన్ 'భారత్‌లో తయారీ' కార్యక్రమాన్ని ప్రోత్సహించడం.. భారత యువతకు అంతర్జాతీయ స్థాయి ప్రామాణిక ఉత్పత్తులను తయారు చేసే అవకాశాలను అందించాలన్న లక్ష్యంతో ఉంది. ఈ మిషన్ దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఎంఎస్ఎంఈలు, చిన్న స్థాయి పారిశ్రామికవేత్తలకు మద్దతు ఇవ్వడమే కాకుండా, దేశవ్యాప్తంగా కొత్త ఉపాధి అవకాశాలను తీసుకొస్తుంది" అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతుందని ఐఎంఎఫ్ ఇటీవల చేసిన ప్రకటనను ఆయన గుర్తు చేశారు. ఈ వృద్ధికి అనేక కారణాలు ఉన్నాయని, రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో ఉద్యోగావకాశాలు పెరగడం అత్యంత ముఖ్యమైన విషయమని అన్నారు. ఇటీవలి కాలంలో వాహన రంగం, పాదరక్షల పరిశ్రమలు.. ఉత్పత్తి, ఎగుమతుల్లో కొత్త రికార్డులు నమోదు చేశాయని, ఇవి యువతకు గణనీయమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తులు తొలిసారిగా రూ. 1.70 లక్షల కోట్ల ఆదాయాన్ని అధిగమించాయని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది కొత్త ఉద్యోగాలను సృష్టించాయని ఆయన వివరించారు. 2014కు ముందు కేవలం 18 మిలియన్ టన్నుల సరుకు మాత్రమే అంతర్గత జలమార్గాల ద్వారా రవాణా అయ్యేదని.. ఈ ఏడాది అది 145 మిలియన్ టన్నులకు చేరినట్లు తెలిపారు. ఈ విజయానికి భారత్ అనుసరిస్తోన్న స్థిరమైన విధానాలు, నిర్ణయాలే కారణమని ఆయన పేర్కొన్నారు. దేశంలో జాతీయ జలమార్గాల సంఖ్య కేవలం 5గా ఉండేదని, అది 110కి పెరిగిందని తెలిపారు. ఈ జలమార్గాల పొడవు సుమారు 2,700 కిలోమీటర్ల నుంచి దాదాపు 5,000 కిలోమీటర్లకు చేరుకుందని వివరించారు. ఈ విజయాలన్నీ దేశవ్యాప్తంగా యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయని వ్యాఖ్యానించారు.

ముంబయి త్వరలో ప్రపంచ దృశ్య శ్రవణ వినోద సదస్సు (వేవ్స్) 2025కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ కార్యక్రమం యువతను ప్రధానాంశంగా పరిగణిస్తోంది. యువ సృష్టికర్తలకు మొట్టమొదటిసారిగా ఇలాంటి వేదికను అందిస్తోంది. మీడియా, గేమింగ్, వినోద రంగాల్లోని ఆవిష్కర్తలు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ సదస్సు అపూర్వ అవకాశాన్ని కల్పిస్తుంది" అని ప్రధాని అన్నారు. వినోద రంగ అంకురాలకు పెట్టుబడిదారులు, పరిశ్రమలో నాయకత్వ స్థాయి వ్యక్తులతో అనుసంధానం అయ్యే అవకాశం ఈ కార్యక్రమంలో ఉంటుందని.. తమ ఆలోచనలను ప్రపంచానికి తెలియజేసేందుకు ఇది అతిపెద్ద వేదిక అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే వివిధ వర్క్‌షాప్‌ల ద్వారా యువత కృత్రిమ మేధ, ఎక్స్ఆర్, ఇమ్మర్సివ్ మీడియాపై అవగాహన పెంచుకోవచ్చని తెలిపారు. "భారత డిజిటల్ కంటెంట్ భవిష్యత్తుకు వేవ్స్ ఉత్తేజాన్ని తీసుకొస్తుంది" అని ఆయన అన్నారు. భారత యువతలో ఉన్న సమ్మిళితత్వాన్ని కొనియాడిన ఆయన.. దేశ సాధిస్తోన్న విజయాలకు సమాజంలోని ప్రతి వర్గం తమ వంతు సహకారం అందిస్తోందన్నారు. ఇటీవల యూపీఎస్సీ ఫలితాల్లో తొలి రెండు స్థానాలను మహిళలే దక్కించుకున్నారని, అగ్రస్థానాల్లో ఉన్న ఐదుగురిలో ముగ్గురు మహిళలే అన్న ఆయన.. భారత ఆడపడుచులు నాయకత్వం వహిస్తున్నారని అన్నారు. ''ప్రభుత్వ ఉద్యోగాల నుంచి అంతరిక్షం, శాస్త్ర విజ్ఞానం వంటి రంగాల్లో మహిళలు ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారు. స్వయం సహాయక బృందాలు, బీమా సఖి, బ్యాంక్ సఖీ, కృ?షి సఖి వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ మహిళల సాధికారతపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ కార్యక్రమాలు కొత్త అవకాశాలను సృష్టించాయి" అని వ్యాఖ్యానించారు. వేలాది మంది మహిళలు ఇప్పుడు డ్రోన్ దీదీలుగా పనిచేస్తున్నారని.. వారి కుటుంబాలు, గ్రామాలు సుభిక్షంగా ఉన్నాయని తెలిపారు. దేశంలో 90 లక్షలకు పైగా స్వయం సహాయక బృందాలు క్రియాశీలకంగా ఉన్నాయని, ఇందులో 10 కోట్లకు పైగా మహిళలు సభ్యులుగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ బృందాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం బడ్జెట్‌ను ఐదు రెట్లు పెంచిందన్నారు. రూ.20 లక్షల వరకు పూచీకత్తు లేని రుణాలను కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ముద్రా యోజన ద్వారా అత్యధికంగా లబ్ధిపొందుతున్నది మహిళలేనని.. దేశంలోని 50,000 అంకురాల్లో మహిళలే డైరెక్టర్లుగా ఉన్నారని ప్రధాని పేర్కొన్నారు. అన్ని రంగాలలో ఇటువంటి పరివర్తనాత్మక మార్పులు అభివృద్ధి విషయంలో భారత్ సంకల్పాన్ని బలోపేతం చేస్తున్నాయని.. ఉపాధి, స్వయం ఉపాధికి మరిన్ని అవకాశాలను సృష్టిస్తున్నాయని వివరించారు.

ఇవాళ నియామక పత్రాలు అందుకున్న యువతనుద్దేశించి మాట్లాడుతూ.. సాధించిన ఉద్యోగాలు వారి కృషి, అంకితభావం ఫలితమని ప్రధానంగా చెప్పారు. తమ జీవితంలోని తదుపరి దశలను తమ సొంతానికే కాకుండా దేశానికి అంకితం చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఉద్ఘాటించారు. ప్రజాసేవ చేయాలనే స్ఫూర్తికి పెద్దపీట వేయాలని సూచించారు. తమ కర్తవ్యం పట్ల అత్యంత గౌరవంతో పనిచేసినప్పుడు.. వారి చేస్తున్న పనికి దేశాన్ని కొత్త దిశలో నడిపించే శక్తి వస్తుందని అన్నారు. విధులు నిర్వర్తించడం, సృజనాత్మకత, వ్యక్తుల నిబద్ధత దేశంలోని ప్రతి పౌరుడి జీవితాలను మెరుగుపరచడానికి ప్రత్యక్షంగా దోహదం చేస్తాయని ప్రధానంగా చెప్పారు.

వ్యక్తులు బాధ్యతాయుతమైన స్థానాలకు చేరుకున్నప్పుడు.. దేశ పౌరులుగా వారి పాత్ర, విధులు మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంటాయని ప్రధాని పేర్కొన్నారు. ఈ దిశగా అవగాహన ఉండాల్సిన అవసరాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. 'తల్లి పేరు మీద ఒక చెట్టు (ఏక్ పేడ్ మా కే నామ్)' పేరుతో జరుగుతున్న కార్యక్రమాన్ని ప్రధానంగా ప్రస్తావించిన ఆయన ప్రకృతికి కృతజ్ఞతగా, సేవకు చిహ్నంగా ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరిట ఒక మొక్కను నాటాలని కోరారు. తమ పనిచేసే ప్రదేశంలో ఎక్కువ మందిని ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చేయాలని ఆయన కోరారు. మంచి ఉద్యోగ జీవితంలో పాటు ఆరోగ్యకరమైన జీవితాన్ని ప్రారంభించడానికి జూన్‌లో రానున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం ఒక గొప్ప సందర్భం అని పేర్కొన్నారు. ఆరోగ్యం వ్యక్తిగతమైన అంశం మాత్రమే కాదని.. పని సామర్థ్యం, దేశ ఉత్పాదకతకు కూడా కీలకమైనదని ప్రధానంగా తెలిపారు. తమ సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి మిషన్ కర్మ యోగి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ప్రధాని ప్రజలకు పిలుపునిచ్చారు. కేవలం పదవుల్లో ఉండటం మాత్రమే లక్ష్యం కాకూడదని.. దేశంలోని ప్రతిఒక్కరికి సేవ చేయడం, దేశ పురోగతికి తోడ్పడటమే లక్ష్యమని పేర్కొన్నారు. జాతీయ పౌర సేవల దినోత్సవం సందర్భంగా చెప్పిన 'నాగరిక్ దేవో భవ' మంత్రాన్ని గుర్తు చేసిన ఆయన.. పౌరులకు సేవ చేయడం దైవారాధనతో సమానమని ప్రధానంగా చెప్పారు. చిత్తశుద్ధి, అంకితభావంతో భారతదేశం అభివృద్ధి చెందిన, సంపన్న దేశంగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 140 కోట్ల మంది భారతీయుల కలలు, ఆకాంక్షల సాధనకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# గేట్ వే ఆఫ్ అమరావతి గా మచిలీపట్నం పోం- మంత్రులు జనార్ధనరెడ్డి, కొల్లు రవీంద్ర



అమరావతి, ఏప్రిల్ 28: మచిలీపట్నం పోర్ట్ నిర్మాణాన్ని వేగవంతంగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దీనిలో భాగంగా పోర్ట్ నిర్మాణంపై ప్రతి నెలా మారిటైమ్ బోర్డు సమీక్ష చేస్తోనీదని రహదారులు భవనాల మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ కొల్లు రవీంద్ర తెలిపారు. మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఆర్టీసీ సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణ ,జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి మచిలీపట్నం పోర్ట్ నిర్మాణ పనులను మంత్రులు సోమవారం పరిశీలించారు. మెగా ఇంజినీరింగ్ సంస్థ జనరల్ మేనేజర్ జి. తులసీదాస్ పోర్టు నిర్మాణ పనుల పురోగతిని మంత్రులకు, అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రతినెలా పోర్ట్ ను సనీదర్శించి పనులు వేగవంతంగా చేసేందుకు చర్యలు తీసుకోవాలని మారిటైమ్ బోర్డు చీఫ్ ఇంజినీర్ జీవి రాఘవరావుని మంత్రి జనార్ధనరెడ్డి ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధనరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికీ పోర్ట్ పనులు 35 శాతం పూర్తయ్యాయని చెప్పారు. 2025 అక్టోబర్ కు పోర్ట్ నిర్మాణాన్ని కాంట్రాక్టు సంస్థ పూర్తి చేయాల్సి ఉందన్నారు . కాంట్రాక్ట్ సంస్థ 2026 నవంబర్ వరకు గడువు కోరుతోందని, జూన్ నెలకు 2026 మధ్యనీతరానికి పూర్తి చేయాలని సూచించామన్నారు. పోర్టుకు అనుసంధానంగా జాతీయ రహదారులు, రైల్వే లైన్లను ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రాజధాని అమరావతికి మచిలీపట్నం పోర్ట్ గేట్ వే ఆఫ్ అమరావతిగా నిలుస్తుందన్నారుమంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ టీడీపీ పోరాట ఫలితంగానే మచిలీపట్నం పోర్ట్ నిర్మాణం జరుగుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పోర్టు నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని అన్నారు. పోర్టు నిర్మాణంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు . పోర్టు తో పాటు అనుబంధ పరిశ్రమల నిర్మాణానికి భూములు అందుబాటులో ఉన్నాయని అన్నారు. పోర్టు నిర్మాణంతో ఈ ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం మంత్రులు అధికారులు, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు పరిశీలించారు.




# ఈనెల 30న శ్రీవారి సేవ జూన్ నెల కోటా ఆన్‌లైన్‌లో విడుదల

తిరుపతి, ఏప్రిల్ 28:శ్రీవారి సేవ స్వచ్ఛంద సేవ జూన్ నెల ఆన్‌లైన్ కోటాను ఏప్రిల్ 30న టీటీడీ విడుదల చేయనుంది.

విడుదల సమయ వివరాలు:

జనరల్ శ్రీవారి సేవ (తిరుమల, తిరుపతి) - ఉదయం 11:00 గంటలకు

నవనీత సేవ (మహిళలకు మాత్రమే) - మధ్యాహ్నం 12:00 గంటలకు

పరకామణి సేవ (పురుషులకు మాత్రమే) - మధ్యాహ్నం 1:00 గంటలకు

గ్రూప్ లీడర్ సేవ (కొత్తగా ప్రారంభించిన సేవ) -మధ్యాహ్నం 2:00 గంటలకు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు శ్రీవారి సేవ నాణ్యతను మెరుగు పరిచి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో టీటీడీ అధికారులు సత్యసాయి సేవా సంస్థ (పుట్టపర్తి ), ఇషా ఫౌండేషన్ (కోయంబత్తూర్ ), ఆర్ట్ ఆఫ్ లివింగ్ (బెంగళూరు ) వంటి ప్రఖ్యాత సంస్థలను సందర్శించి అధ్యయనం చేశారు. ఈ అధ్యయనం ఆధారంగా శ్రీవారి సేవలో కొన్ని ముఖ్యమైన మార్పులను టీటీడీ తీసుకొచ్చింది. ఈ మార్పులు ఏప్రిల్ 30న కొత్తగా రూపొందించిన అప్లికేషన్ ద్వారా అమలులోకి రానున్నాయి.

ఇకపై "గ్రూప్ లీడర్స్‌గా" సీనియర్ సేవకులు..

గత రెండు సంవత్సరాలుగా పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు సేవలో పాల్గొంటున్నారు. వయస్సు 45 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల మధ్య ఉన్న వారు నమోదు కావచ్చు. ఇప్పుడు వీరిని "గ్రూప్ లీడర్స్" అని పిలుస్తారు. వీరు 15 రోజుల, ఒక నెల లేదా మూడు నెలల వ్యవధిలో సేవ చేయడానికి ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకోవచ్చు.

గ్రూప్ లీడర్స్ బాధ్యతలు..

ఈ గ్రూప్ లీడర్స్ శ్రీవారి సేవకుల పనిని పర్యవేక్షించడం, సేవకు వారి హాజరు తీసుకోవడం, ప్రతి ఒక్క సేవకుని/సేవకురాలి పనితీరును మూల్యాంకనం చేయడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారు.

పరకామణి సేవలో జనరల్ పురుష సేవకులకు అవకాశం..

కనీసం పదో తరగతి విద్యార్హత కలిగిన పురుషులకు పరకామణి సేవలో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. ఈ మేరకు ఆన్ లైన్ ద్వారా పరకామణి సేవను బుక్ చేసుకోవచ్చుని తెలియజేయడమైనది.

# మల్లన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



అమరావతి, ఏప్రిల్ 28:నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారం హైకోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశైలంలోని మల్లన్న స్వామి గుడికి చేరుకున్న న్యాయమూర్తి దంపతులకు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరావు స్వాగతం పలికారు. వేద పండితులు ఆశీర్వచనం పలికారు. దేవాలయంలోని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం పూజా కార్యక్రమాలతో పాటు గర్భగుడి దర్శనాన్ని చేపట్టారు. అనంతరం మల్లికార్జున స్వామి చిత్రపటాన్ని న్యాయమూర్తికి సమర్పించారు. ఆళ్లగడ్డ డీఎస్పీ రామాంజి నాయక్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

గగనతల ఆంక్షల నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యం, భద్రత, నిబంధనల అమలు కోసం

# తక్షణం చర్యలు తీసుకోవాలంటూ విమానయాన సంస్థలను ఆదేశించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:ఇటీవల అంతర్జాతీయ గగనతల మూసివేతలు, విమాన మార్గాలపై ఆంక్షల నేపథ్యంలో, అనేక విమాన మార్గాల్లో కీలకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఫలితంగా ప్రయాణ కాలం పెరగడంతోపాటు ఇంధన అవసరాల కోసం విమానాలను మధ్యలో ఆపాల్సిన అవసరం పెరిగింది. ప్రయాణికుల సౌకర్యం, భద్రత నియంత్రణల అమలును కొనసాగించడానికి మెరుగైన ప్రయాణికుల నిర్వహణ చర్యలను తక్షణమే తీసుకోవాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) అన్ని విమానయాన సంస్థల్ని ఆదేశించింది.

స్పష్టమైన సమాచారం: మారిన మార్గాలు, పొడిగించిన ప్రయాణ కాలం, ప్రయాణ సమయంలో సంభవించే సాంకేతిక అంతరాయాల గురించి ప్రయాణికులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలి. ఈ సమాచారాన్ని చెక్-ఇన్, బోర్డింగ్ సమయంలో డిజిటల్ అలర్ట్‌ల ద్వారా అందించాలి.

విమానంలో మెరుగైన సేవలు: విమానయాన సంస్థలు అసలు బ్లాక్ టైమ్‌ను ఆధారంగా చేసుకుని క్యాటరింగ్ సేవలను పునఃసమీక్షించాల్సి ఉంటుంది. ప్రయాణ కాలం, మొత్తానికి సరిపడా ఆహారం, తాగునీరు, ప్రత్యేక భోజనాలను సిద్ధంగా ఉంచాలి. సాంకేతిక కారణాలతో నిలిపివేత చోటుచేసుకున్నప్పటికీ ఈ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలి.

వైద్య సిద్ధత: ఎయిర్‌లైన్స్ తమ విమానాల్లో తగినంత వైద్య సహాయ సరంజామాను సిద్ధంగా ఉంచాలి. అకస్మాత్తుగా ఆపవలసివస్తే ఆయా విమానాశ్రయాల్లో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయో లేదో నిర్ధారించాలి.

కస్టమర్ సపోర్ట్ సంసిద్ధత: ఆలస్యాలు, మిస్ అయిన కనెక్షన్లు వంటి సమస్యలను సమర్థంగా నిర్వహించేందుకు కాల్ సెంటర్లు, కస్టమర్ సర్వీస్ బృందాలు సిద్ధంగా ఉండాలి. వర్తించే నిబంధనల ప్రకారం అవసరమైన సహాయం లేదా నష్టపరిహారం అందించాలి.

నిర్వహణ సమన్వయం: విమాన కార్యకలాపాలు, కస్టమర్ సర్వీస్, గ్రౌండ్ హ్యాండ్లింగ్, ఇన్ ఫ్లైట్ సేవలు, వైద్య భాగస్వాముల మధ్య అంతరాయం లేని సమన్వయం అవసరం.

ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాల్సిందిగా అన్ని ఎయిర్‌లైన్స్‌కు సూచించారు. దీనిని పాటించడంలో విఫలమైతే వర్తించే పౌర విమానయాన ఆవశ్యకతల (సిఎఆర్) కింద నియంత్రణ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ ఆదేశాలు వెంటనే అమలులోకి వస్తాయి. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఇవి అమల్లో ఉంటాయి.

# బొగ్గు, గనుల రంగాలు బలమైన పునాదిగా... దూసుకెళ్తున్న భారత ఆర్థిక రంగానికి మూలాధారం ఉక్కు పరిశ్రమ: కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: ఈరోజు ముంబయిలో జరిగిన ఉక్కు రంగం ద్వైవార్షిక అంతర్జాతీయ ప్రదర్శన-సమావేశం, ఇండియా స్టీల్ 6వ ఎడిషన్‌ను ఉద్దేశించి కేంద్ర బొగ్గు, గనుల శాఖా మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ప్రసంగించారు. అభివృద్ధిలో దూసుకెళ్తున్న ఉక్కు రంగం, బొగ్గు పరిశ్రమతో దాని సహసంబంధం గురించి విధాన రూపకర్తలు, పరిశ్రమ ప్రముఖులు, విద్యావేత్తలు, పరిశోధకులు, పౌరుల మధ్య చర్చలకు ఈ కార్యక్రమం ఒక ముఖ్య వేదికగా నిలిచింది.

కేంద్ర బొగ్గు, గనుల శాఖా మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి తన కీలక ఉపన్యాసంలో... భారత ఆర్థిక పురోగతికి ఉక్కు వెన్నెముకగా నిలుస్తోందన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే జాతీయ దార్శనికతకు ఈ పరిశ్రమ కీలక చోదక శక్తిగా పనిచేస్తోందని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో నిర్మించిన జమ్మూ కాశ్మీర్‌లోని చీనాబ్ వంతెన నుంచి తమిళనాడులోని చారిత్రాత్మక పాంబన్ వంతెన వరకు మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భారత్ సరికొత్త ప్రపంచస్థాయి ప్రమాణాలను నిర్దేశిస్తున్నదన్న కేంద్రమంత్రి... ఇవన్నీ ఉక్కు రంగ బలం పెరగడం ద్వారానే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. దేశ మౌలిక సదుపాయాల ప్రయాణంలోని ప్రతి మైలురాయి ఉక్కుతోనే ముడిపడి ఉందని ఆయన వ్యాఖ్యానించారు. మన దేశ ముందడుగును, ఆకాంక్షలను ఇది ప్రతిబింబిస్తుందని తెలిపారు.

ఇటీవలి కాలంలో భారత ఉక్కు రంగం అద్భుతమైన వేగంతో వృద్ధి చెందిన క్రమంలో, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఉక్కు ఉత్పత్తిదారుగా భారత్ నిలిచిందన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మాటలను ఉటంకిస్తూ, ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ ద్వారా దేశీయ వినియోగం, పారిశ్రామిక విస్తరణ, స్వీయ-సమృద్ధితో కీలక చోదక శక్తిగా ఉన్న ఉక్కు రంగాన్ని భారత "సన్‌రైజ్ సెక్టార్"గా కేంద్రమంత్రి అభివర్ణించారు.

బొగ్గు, గనుల రంగాల బలమైన పునాదిపై దూసుకెళ్తున్న భారత ఆర్థిక వ్యవస్థకు ఉక్కు రంగం మూలాధారంగా ఉందని శ్రీ కిషన్ రెడ్డి తెలిపారు. ముడి పదార్థాల వ్యూహం, ముడి పదార్థాల మిశ్రమంలో మార్పు గురించి జరుగుతున్న ప్రస్తుత సమావేశ సందర్భంలో, ముడి పదార్థాల భద్రత ప్రాముఖ్యతను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. ఇనుప ఖనిజం, కోకింగ్ కోల్, సున్నపురాయి వంటి కీలక ముడి పదార్థాల లభ్యతతో పాటు మాంగనీస్, నికెల్, క్రోమియం వంటి ముఖ్యమైన మిశ్రమ మూలకాల లభ్యతను నిర్ధారించడం ఆర్థిక, వ్యూహాత్మక ఆవశ్యకతగా ఆయన పేర్కొన్నారు.

గత ఆర్థిక సంవత్సరంలో 1 బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, పంపిణీ ఘనతను భారత్ సాధించింది - ఇది జాతీయ ఇంధన భద్రత దిశగా పరివర్తనాత్మక ముందడుగు. భారత మొత్తం ఇంధన అవసరాల్లో దాదాపు 60 శాతం.. దాని విద్యుత్ ఉత్పత్తిలో 70 శాతం బొగ్గు ద్వారానే జరుగుతున్నట్లు ఇంధన గణాంకాలు 2025 వెల్లడిస్తున్నాయి. పునరుత్పాదక ఇంధనాలను పెంచే ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ, రాబోయే కాలంలో బొగ్గు భారత ఇంధన, పారిశ్రామిక రంగాలకు కేంద్రంగా ఉంటుందని కేంద్రమంత్రి పునరుద్ఘాటించారు.

ఉక్కు తయారీలో కీలకమైన కోకింగ్ కోల్, ఉక్కు ఉత్పత్తి వ్యయంలో దాదాపు 42 శాతం వాటా కలిగి ఉందని శ్రీ కిషన్ రెడ్డి తెలిపారు. ప్రస్తుత కోకింగ్ కోల్ అవసరాల్లో 85 శాతం భారత్ దిగుమతి చేసుకుంటున్న క్రమంలో, అంతర్జాతీయంగా ధరల అస్థిరత, సరఫరాలో అంతరాయాల వంటి సమస్యలు ఎదుర్కొంటున్నట్లు ఆయన వివరించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, 140 మెట్రిక్ టన్నుల దేశీయ ఉత్పత్తి సాధించడం, 2030 నాటికి ఉక్కు తయారీలో దేశీయ బొగ్గు మిశ్రమాన్ని 10 శాతం నుంచి 30 శాతానికి పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం 2021లో మిషన్ కోకింగ్ కోల్‌ను ప్రారంభించింది.

కొత్త అన్వేషణ ప్రాంతాలను గుర్తించడం, ప్రస్తుత గనుల నుంచి ఉత్పత్తిని పెంచడం, బొగ్గు వాషింగ్ సామర్థ్యాన్ని పెంచడం, ప్రైవేట్ సంస్థల కోసం కొత్త కోకింగ్ కోల్ బ్లాకుల వేలం వంటి కీలక చర్యలు ఈ మిషన్‌లో భాగంగా ఉన్నాయి. దీని ద్వారా నాణ్యతలో రాజీ లేకుండా అధిక బూడిద గల దేశీయ బొగ్గును ఉపయోగించుకునేందుకు స్టాంప్ ఛార్జింగ్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించేలా ప్రోత్సాహం అందిస్తున్నారు. 2030 నాటికి 58 మిలియన్ టన్నుల బొగ్గు వాషింగ్ సామర్థ్యాన్ని సాధించడంతో పాటు 23 మిలియన్ టన్నుల వాష్డ్ కోకింగ్ బొగ్గును సరఫరా చేసే లక్ష్యంతో ఈ మిషన్ రూపొందించారు.

వాషరీలు, బెనిఫిషియేషన్ ప్లాంట్లు, బ్లాక్‌ల వేలంలో ప్రైవేట్ సంస్థలు చురుగ్గా పాల్గొనాలని కేంద్రమంత్రి పిలుపునిచ్చారు. దేశీయ బొగ్గును ఉపయోగిస్తున్న పల్వరైజ్డ్ కోల్ ఇంజెక్షన్ (పీసీఐ) ట్రయల్స్ ఇప్పటికే దిగుమతి ప్రత్యామ్నాయంగా ఆశాజనకంగా కొనసాగుతున్నాయనీ, బెనిఫిషియేషన్‌లో గొప్ప ఆవిష్కరణలతో మరింత మెరుగైన ఫలితాలను ఆశించవచ్చని ఆయన తెలిపారు.

ఇనుప ఖనిజం గురించి ప్రస్తావిస్తూ, 35 బిలియన్ టన్నులకు పైగా విస్తారమైన నిల్వలతో భారత్ ప్రపంచంలో ఐదో స్థానంలో ఉందని కేంద్రమంత్రి తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 263 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం ఉత్పత్తి కాగా, 50 మిలియన్ టన్నులు ఎగుమతి చేయడంతో పాటు, పెరుగుతున్న దేశీయ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా ఉండేలా కృషి జరుగుతోందన్నారు. ప్రస్తుతం, మన వద్ద 179 క్రియాశీల ఇనుప ఖనిజ గనులు ఉన్నాయనీ, ఇప్పటివరకు 126 బ్లాక్‌ల వేలం పూర్తవగా 38 గనుల్లో ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభమైనట్లు కేంద్రమంత్రి వివరించారు. మరిన్ని గనుల్లో త్వరలోనే పూర్తి స్థాయి కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, 66 శాతానికి పైగా నిల్వలు మధ్యస్థ, తక్కువ-గ్రేడ్ నాణ్యత గలవేనని, వీటి కోసం బెనిఫిషియేషన్ అవసరమని ఆయన తెలిపారు.

ఈ సమస్యను పరిష్కరించేందుకు గానూ, తక్కువ-గ్రేడ్ ఖనిజ బెనిఫిషియేషన్‌ను ప్రోత్సహించడం కోసం గనుల మంత్రిత్వ శాఖ ప్రస్తుతం ప్రజా సంప్రదింపుల దశలో ఉన్న ఒక విధానాన్ని ప్రతిపాదించింది. ప్రైవేట్ రంగం భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి సున్నపురాయి, తక్కువ-గ్రేడ్ ఖనిజానికి రాయల్టీ రేట్ల సవరణ సహా విధానపరమైన సంస్కరణలు కొనసాగుతున్నాయి.

ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించినట్లుగా గ్రీన్‌ఫీల్డ్ గనులను సకాలంలో ఉపయోగించుకోవాల్సిన ప్రాముఖ్యతను శ్రీ కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. అటువంటి వనరులను సద్వినియోగం చేయడంలో జాప్యం చేయడం జాతీయ వనరులను వృధా చేయడమే అవుతుందన్నారు. గనుల అభివృద్ధిని వేగవంతం చేయడానికి తమ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలతో కలిసి పనిచేస్తోందనీ, బిడ్డర్లతో పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షిస్తోందని తెలిపారు. అనుమతుల క్రమబద్ధీకరణ కోసం పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎమ్ఓఈఎఫ్‌సీసీ)తో మెరుగైన సమన్వయంతో పనిచేస్తున్నట్లు వివరించారు. గత ఆరు నెలల కాలంలో అనేక కీలక మార్గదర్శకాలు జారీ చేశామనీ, మరిన్ని సంస్కరణలు పురోగతిలో ఉన్నట్లు కేంద్రమంత్రి తెలిపారు.

బొగ్గు, మైనింగ్ రంగాలు దిగుమతులపై ఆధారపడుటను తగ్గిస్తూ, భారత వాతావరణ నిబద్ధత.. సుస్థిరత లక్ష్యాలకు అనుగుణంగా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ, ఈ సవాళ్ల కోసం సంపూర్ణ ప్రభుత్వ విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు.

ఈ దిశలో నేషనల్ కోల్ గ్యాసిఫికేషన్ మిషన్ ఒక ప్రధాన కార్యక్రమంగా నిలుస్తుంది, ఇది రూ. 8,500 కోట్ల పెట్టుబడితో 2030 నాటికి 100 మెట్రిక్ టన్నుల గ్యాసిఫికేషన్ సాధించే లక్ష్యంతో కొనసాగుతోంది. డిఆర్ఐ (డైరెక్ట్ రెడ్యూస్డ్ ఐరన్) ఉక్కు తయారీ కోసం పరిశుభ్రమైన ప్రత్యామ్నాయంగా ఉన్న సింథసిస్ గ్యాస్ (సింగ్యాస్) ఉత్పత్తి చేయడానికి అధిక-బూడిద గల, నాన్-కోకింగ్ దేశీయ బొగ్గు వినియోగాన్ని ఈ కార్యక్రమం ప్రోత్సహిస్తుంది. ఉద్గారాలను తగ్గించడమే కాకుండా ఇంధన భద్రత, ఎకనమిక్ వాల్యూ చెయిన్‌లను మెరుగుపరిచే ఈ పరివర్తనాత్మక సాంకేతికతలో పెట్టుబడి పెట్టాలని పరిశ్రమ ప్రముఖులను శ్రీ కిషన్ రెడ్డి కోరారు.

అంతే కాకుండా, అధునాతన మిశ్రమలోహాలు, గ్రీన్ టెక్నాలజీలకు మద్దతు కోసం డంప్‌లు, టైలింగ్‌ల నుంచి కీలకమైన ఖనిజాలను తిరిగి పొందడంపై దృష్టి పెట్టాలని గనుల నిర్వాహకులకు కేంద్రమంత్రి పిలుపునిచ్చారు. ఇప్పటికే ఉన్న డంప్‌లను పరీక్షించడం అలాగే వాటి నుంచి ఖనిజాలను తిరిగి పొందడం జాతీయ ప్రాధాన్యంగా చేపట్టాలని కోరారు.

సురక్షితమైన, అన్ని రకాల పరిస్థితులను తట్టుకోగల, సుస్థిరమైన ముడి పదార్థాల వ్యూహం దిశగా సాగే ప్రయాణం సమిష్టి ప్రయాణం అవుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో, భారత్ ఉక్కు రంగం విషయంలో సాహసోపేతమైన, ప్రతిష్టాత్మకమైన మార్గంలో ముందుకు సాగుతోంది. 2030-31 నాటికి 300 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని, 2047 నాటికి 500 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించడమే జాతీయ ఉక్కు విధానం లక్ష్యం. బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖలు ఈ దార్శనికతకు పూర్తిగా అనుగుణంగా పనిచేస్తున్నాయి అలాగే ఆ లక్ష్యాన్ని సాధించడం కోసం అవసరమైన చర్యలను చేపడుతున్నాయి.

కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమ భాగస్వాముల మధ్య సన్నిహిత సహకారం ద్వారా, భారత్ దేశీయంగా తన ముడి పదార్థాల అవసరాలను తీర్చడమే కాకుండా, సుస్థిరత.. స్వీయ-సమృద్ధితో ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతుందని శ్రీ కిషన్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. భారత ఉక్కు రంగం కోసం హరిత.. మరింత సమర్థమైన భవిష్యత్తును అందించే విధానాలను రూపొందించుటలో తమవంతు సహకారం అందించాలని సమావేశానికి హాజరైన వారికి శ్రీ కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

పలువురు కేంద్ర మంత్రులు, మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్న ఈ సమావేశ ప్రారంభోత్సవ సందర్భంగా, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దృశ్య మాధ్యమం ద్వారా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ఈ రంగంలో సహకారాత్మక అభివృద్ధి ప్రాముఖ్యతను వివరించారు.

స్టీల్ ఎక్స్‌పో రెండో రోజున, ఉక్కు రంగంలో ముడి పదార్థాల లభ్యతపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవ్ దత్ మాట్లాడుతూ, బొగ్గు రంగం అనుసరిస్తున్న విధానంలో గణనీయమైన మార్పును ప్రధానంగా ప్రస్తావించారు. వారసత్వ రంగంగా ఉన్న ఈ రంగం నేడు ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు మూల స్తంభంగా మారిందని ఆయన పేర్కొన్నారు. మంత్రిత్వ శాఖ భవిష్యత్ వ్యూహాన్ని వివరిస్తూ, దేశీయ కోకింగ్ కోల్ ఉత్పత్తిని పెంచడం, ఇంధన నాణ్యతను పెంచడం కోసం బొగ్గు వాషింగ్ పద్ధతులను మెరుగుపరచడం, శుభ్రమైన ఉక్కు తయారీకి వీలుగా అధునాతన కోక్ తయారీ, గ్యాసిఫికేషన్ సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించుకునేలా ప్రోత్సహించేందుకు కృషి జరుగుతోందని వివరించారు. ఆవిష్కరణలను పెంపొందించడానికి, భారత బొగ్గు నిల్వల పూర్తి సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు సహకారాత్మక విధానం అనుసరించాల్సిన అవసరముందని ఆయన స్పష్టం చేశారు.

ఉక్కు మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఈ ఇండియా స్టీల్ ఎక్స్‌పో 2025 ఈ రంగానికి చెందిన ప్రపంచ స్థాయి ప్రముఖులు వృద్ధి వ్యూహాలు, ఉక్కు ఉత్పత్తిలో సుస్థిర పద్ధతులు, అభివృద్ధి చెందుతున్న ప్రపంచ ఆర్థిక పరిస్థితుల మధ్య అన్ని పరిస్థితులను తట్టుకునే సమర్థత, పారిశ్రామిక పోటీతత్వాన్ని పెంచడంలో ఆవిష్కరణలు, డిజిటల్ పరివర్తనల కీలక పాత్ర వంటి ప్రధాన అంశాలను గురించి చర్చించేందుకు ఒక గొప్ప వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో నిర్మాణాత్మకంగా దృక్పథాలను పంచుకోవడం, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల ప్రదర్శనలతో పాటు, వనరుల సామర్థ్యం, పర్యావరణ బాధ్యత వంటి అంశాలపై సమగ్ర చర్చలు జరిగాయి. బొగ్గు మంత్రిత్వ శాఖ క్రియాశీల భాగస్వామ్యం బొగ్గు, ఉక్కు రంగాల వ్యూహాత్మక ఐక్యతను స్పష్టం చేసింది. సుస్థిరమైన, స్వీయ-సమృద్ధి గల, ముందుచూపుతో కూడిన పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడంలో ఈ రెండు రంగాల సమిష్టి నిబద్ధతను ఇది ప్రతిబింబించింది. ప్రముఖ దేశీయ, అంతర్జాతీయ భాగస్వాములు హాజరైన ఈ సమావేశం ప్రపంచ బొగ్గు, ఉక్కు రంగాల భవిష్యత్తును రూపొందించడంలో పెరుగుతున్న భారత స్థాయిని పునరుద్ఘాటించింది.

# సంయమనం పాటించండి.. ఇండియా, పాక్‌ను కోరిన చైనా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:ఇండియా, పాకిస్థాన్ దేశాలు సంయమనం పాటించాలని డ్రాగన్ దేశం చైనా కోరింది. పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ప్రస్తుతం ఇండియా, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. మరో వైపు కొన్ని రోజుల నుంచి నియంత్రణ రేఖ వద్ద ఇరు దేశాల బలగాలు ఫైరింగ్‌కు పాల్పడితున్నాయి. ఈ నేపథ్యంలో చైనా విదేశాంగ ప్రతినిధి గువో జాయికున్ మీడియాతో మాట్లాడుతూ ఈ అభ్యర్థన చేశారు.

ఇరు దేశాలు సంయమనం పాటిస్తాయని ఆశిస్తున్నామని, ఒకర్ని ఒకరు కలుసుకుని.. చర్చల ద్వారా విభేధాలను పరిష్కరించుకోవాలని, ప్రాంతీయ స్థిరత్వాన్ని, శాంతిని నెలకొల్పాలని భావిస్తున్నట్లు చైనా ప్రతినిధి జాయికున్ తెలిపారు.

ఉద్రిక్త పరిస్థితుల్ని చల్లార్చే ఎటువంటి చర్యనైనా స్వాగతిస్తామని చైనా పేర్కొన్నది.

ఏప్రిల్ 22వ తేదీన జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు కొత్త ఉద్రిక్తతలకు దారి తీశాయి. నాలుగు ఏళ్ల తర్వాత మళ్లీ ఇండో, పాక్ బోర్డర్ వద్ద కాల్పులు ఘటనలు జరిగాయి. ఇక పెహల్గామ్ దాడికి తామే కారణమని చెప్పుకున్న ద రెసిస్టెన్స్ ఫ్రంట్.. ఇప్పుడు ఆ ఘటనతో తమకు బాధ్యత లేదని చెప్పుకున్నది. ఉగ్రదాడి ఘటనపై తటస్థ విచారణకు సహకరించాలని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ ఫరీఫ్ కోరారు.భారత్ మాత్రం ప్రతీకార చర్యగా సింధూ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేసింది. కశ్మీర్‌లోని ఉగ్రవాదుల ఇండ్లను కూల్చివేస్తోంది.

# కంటైనర్ కిందకు దూసుకెళ్లిన కారు -అయిదుగురు దుర్మరణం

-స్పాట్ లోనే అయిదుగురు దుర్మరణం

-చంద్రగిరి వద్ద ఘటన

-మృతులందరూ తమిళనాడు వాసులే

తిరుపతి, ఏప్రిల్ 28: తిరుపతి జిల్లాలో నేడు జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అయిదుగురు దుర్మరణం చెందారు. చంద్రగిరి నియోజకవర్గంపాకాల మండలం నేంద్రకుంట సమీపంలోని కోనప?ప రెడ్డి పల్లి ఓ కారు అదుపు తప్పి కంటైనర్ కిందకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. ప్రమాదంలో మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తమిళనాడుకు చెందిన వీరంతా కారులో తిరుమలకు బయలుదేరారు. అయితే పాకాల వద్ద కారు ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కంటైనర్‌ను ఢీట్టింది. ఆపై కంటైనర్ కిందకు కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలోనే తమిళనాడుకు చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. కారు ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# విశాఖ మేయర్ గా టిడిపి అభ్యర్థి పీలా శ్రీనివాసరావు ఎన్నిక

విశాఖపట్నం, ఏప్రిల్ 28: గ్రేటర్ విశాఖపట్నం మేయర్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. మేయర్‌గా కూటమి అభ్యర్థి పీలా శ్రీనివాస్ రావు ఎన్నికయ్యారు. మేయర్ అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావు పేరును జనసేన ఎమ్మెల్యే వంశీ కృష్ణ యాదవ్ ప్రతిపాదించగా.. బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు బలపరిచారు. దీంతో మేయర్ అభ్యర్థి ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఇదిలా ఉండగా.. మేయర్ ఎన్నికను వైసీపీ బహిష్కరించింది.

నేడు జరిగిన వీఎంసీ కౌన్సిల్ సమావేశంలో కోరం కంటే ఎక్కువ మంది సభ్యులు హాజరయ్యారు. ఇక మేయర్ ఎన్నిక కోసం కూటమి టీడీపీ అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావు పేరును జనసేన, బీజేపీ, కూటమి కార్పొరేటర్లు బలపరిచారు. పోటీలో ఇంకెవరూ లేనందున మేయర్‌గా పీలా శ్రీనివాస రావు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ ప్రకటించారు. పీలా శ్రీనివాసరావు మేయర్‌గా ఎన్నికైనట్లు ఎన్నిక ధృవపత్రాన్ని జాయింట్ కలెక్టర్ అందజేశారు. ఆపై విశాఖ నూతన మేయర్‌గా పీలా శ్రీనివాసరావుతో ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ ప్రమాణ ప్రమాణ స్వీకారం చేయించారు.


# సభ సక్సెస్‌ను జీర్ణించుకోలేకపోతున్న కాంగ్రెస్: వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ రజతోత్సవ సభ భారీ సక్సెస్ కావడం, అనుకున్న దానికంటే ఎక్కువ జనం రావడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేక పోతున్నదని, అందుకే మంత్రులు, ఆ పార్టీ నాయకులు అడ్డగోలుగా వాగుతున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. సభకు లక్షలాదిగా జనం తరలిరావడం, కేసీఆరే మళ్లీ రావాలి అంటూ నినాదాలు చేస్తూ నిండు మనసుతో మద్దతు తెలపడం చూసి జీర్ణించుకోలేక కాంగ్రెస్ నాయకులు ఆగమేఘాల మీద ప్రెస్‌మీట్లు పెడుతూ సభ సక్సెస్ కాలేదని స్వీయ ఆనందం పొందుతున్నారని ఎద్దేవా చేశారు.

బీఆర్ఎస్ సభ గ్రాండ్ సక్సెస్ అని అన్ని పత్రికలు, టీవీలు రాశాయి. అందులో బీఆర్ఎస్‌కు మద్దతు తెలపని పత్రికలు, టీవీలు కూడా ఉన్నాయని వేముల తెలిపారు. కానీ, కాంగ్రెస్ వాళ్లు మాత్రం కళ్లు ఉండి చూడలేకపోతున్నారన్నారు. 17 నెలల పాలనలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై వచ్చిన వ్యతిరేకత.. సభకు వచ్చిన లక్షలాది ప్రజల్లో స్పష్టంగా కనిపించిందని, అందరూ మళ్లీ కేసీఆర్ రావాలని అంటున్నారన్నారు.

అధికారాన్ని అడ్డుపెట్టుకుని పోలీసులను ఇతర యంత్రాంగాన్ని వాడుకుని సభను విజయవంతం కాకుండా కుట్రలు చేయాలని చూశారన్నారు. సభకు చేరుకున్న జనమే కాకుండా మీ కుట్రల వల్ల బయట రోడ్లపై లక్షలాది ప్రజలు ఉండిపోయారని తెలిపారు. కేసీఆర్ కోసం రాష్ట్ర నలుమూలల నుంచి సునామీలా సభకు తరలివచ్చా రన్నారు. హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ తప్పించుకోలేదని, ఆ పార్టీ వైఫల్యాలను బీఆర్ఎస్ శ్రేణులు ఎక్కడికక్కడ ప్రజల పక్షాన నిలబడి నిలదీస్తారన్నారు.

# భారత్ జోలికి వస్తే మటాష్ - చంద్రబాబు



అమరావతి, ఏప్రిల్ 28: భారత్ జోలికి ఎవరైనా వస్తే మటాష్ అయిపోతారని, భారత్‌ను ఉగ్రవాదం ఏం చేయలేదని సీఎం చంద్రబాబు అన్నారు. పహల్గామ్‌లో ఉగ్రదాడి ఘటన దారుణమైందని అన్నారు.. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రజలు సంఘటితంగా ఉండాలని, తీవ్రవాదం సమస్యలు భారత్‌ను ఏం చేయలేవని పేర్కొన్నారు..


అమరావతిలోని విట్ యూనివర్సిటీలో నిర్వహిస్తోన్న 'వి లాంచ్‌పాడ్ 2025 స్టార్టప్ ఎక్స్‌పో కార్యక్రమానికి నేడు హాజరైన ముఖ్యమంత్రి ముందుగా యూనివర్సిటీ ప్రాంగణంలో గాంధీజీ విగ్రహాన్ని, నూతన భవనాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో భవిష్యత్ అంతా ఎఐ దేనని అన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పారదర్శకత తీసుకొచ్చామన్నారు. స్వర్ణాంధ్ర-2047కు రోడ్ మ్యాప్ సిద్ధం చేశామని చెప్పారు.

హైదరాబాద్ లో 14 నెలల్లో హైటెక్ సిటీ పూర్తి చేశామని, భవిష్యత్ అంతా ఐటీ )దేనని అపట్లో పిలుపు ఇచ్చానని గుర్తు చేశారు చంద్రబాబు. ప్రపంచంలో ఎక్కడికెళ్లిన భారతీయులుంటారని, అందులో అగ్రస్థానంలో తెలుగువారు ఉంటారుని అన్నారు. తెలుగువాళ్ల జనాభా 5 శాతమే.. ఐఐటీల్లో సీట్లు మాత్రం 20 శాతం మనోళ్లవే అని వ్యాఖ్యానించారు.

మే 2న ఏపీకి ప్రధాని..

మే 2న ప్రధాని మోదీ అమరావతికి వస్తున్నారని, ప్రధాని చేతుల మీదుగా అమరావతి పునఃప్రారంభం కాబోతోందని సీఎం చంద్రబాబు అన్నారు. అప్పట్లో ఐటీని ప్రమోట్ చేశానని, ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీని ప్రమోట్ చేస్తున్నానని అన్నారు. ఒకప్పుడు ప్రభుత్వ అటెండర్ ఉద్యోగానికి కూడా డిమాండ్ ఉండేదని, ఇప్పుడు ఐటీ ఉద్యోగానికే డిమాండ్ ఎక్కువగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్, తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ అమరావతి పర్యటనను విజయవంతం చేద్దాం.. చంద్రబాబు



అమరావతి, ఏప్రిల్ 28:అమరావతి రాజధాని పనుల పున:ప్రారంభానికి మే 2న రాష్ట్రానికి వస్తున్న ప్రధాని నరేంద్రమోడీకి ఘన స్వాగతం పలకడంతో పాటు సభను విజయవంతం చేద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. అమరావతి రాజధాని తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నేతలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రధాని మోడీ పర్యటనపై ఎన్డీఏ నేతలతో సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు.

### అమరావతి ఆంధ్రప్రదేశ్ ప్రజల గర్వకారణం..

ఒక కుటుంబం నివసించేందుకు మంచి ఇల్లు ఉండాలని ఎలా అనుకుంటామో ప్రజలు గర్వంగా చెప్పుకోవడానికి కూడా రాజధాని ఉండాలి. అభివృద్ధి వికేంద్రీకరణ ఎన్డీఏ విధానం కాబట్టే 2014 నుంచి కేంద్ర విద్యా సంస్థలు ఉత్తరాంధ్ర, కోస్తా, సీమ జిల్లాల్లో ఏర్పాటు చేశాం. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తాం. తెలంగాణకు హైదరాబాద్, కర్నాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై రాజధానుల ద్వారా 70 శాతం ఆదాయం వస్తోంది. మనకు కూడా మంచి నగరం ఉంటే రాష్ట్రానికి సమృద్ధిగా ఆదాయం సమకూరుతుందని అమరావతిని నిర్మిస్తున్నాం. రాష్ట్రానికి అమరావతి ఆత్మ వంటిదన్నారు.

### ప్రజల్ని తప్పుదారి పట్టించే వ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

రాజధాని నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. వారు ఇచ్చిన భూముల్లోనే రాజధాని నిర్మించడంతో పాటు తిరిగి వారికి రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లు అభివృద్ధి చేసి ఇస్తున్నాం. రాజధానిలో రైతులను భాగస్వాములను చేస్తున్నాం. రాష్ట్రానికి పరిశ్రమలు వస్తే యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయి. రోడ్ల నిర్మాణం జరిగితే రవాణా సౌకర్యం పెరగడంతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. కానీ కొన్ని వ్యతిరేక శక్తులు కుట్రతో ప్రజలను కావాలనే తప్పుదోవ పట్టిస్తాయి. అభివృద్ధిపై బురద జల్లే ప్రయత్నం చేస్తుంటాయి. మనం ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు చేస్తున్న మంచి పనులను గురించి కూడా వివరించాలి. ఎమ్మెల్యేలు, మంత్రులు బాధ్యత తీసుకుని ప్రజలకు తెలియజేయాలి. ఇబ్బందులను అధిగమిస్తూనే సంక్షేమం, అభివృద్ధి బాటను వీడటం లేదన్నారు.

### హామీలు నెరవేర్చుకుంటూ ముందుకు..

అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ముందుకెళ్తున్నాం. పోలవరానికి నిధులు, విశాఖ రైల్వేజోన్ మంజూరు, స్టీల్ ప్లాంట్‌కు రూ. 11,400కోట్లు కేంద్రం కేటాయించింది. యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఇప్పటికే మత్స్యకారుల సేవలో, ఎస్సీ వర్గీకరణ, అన్న క్యాంటీన్లు, పింఛన్లు, 3 గ్యాస్ సిలిండర్లు అందించడంతో పాటు 16,347 ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశాం. వచ్చే నెల రైతులకు అన్నదాత కింద పెట్టుబడి సాయం అందిస్తామన్నారు.

### లాజిస్టిక్ హబ్‌గా రాయలసీమ..

రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే 42 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుడతాం. 175 నియోజకవర్గాల్లోనూ రాబోయే రోజుల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి వన్ ఫ్యామిలీ? వన్ ఎంట్రప్రెన్యూర్ సాకారం దిశగా అడుగులు వేస్తాం.

రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కూడా చేపడతాం. విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం. ఎరైన్-కో రామాయపట్నంలో, అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ దిగ్గజ కంపెనీలు లక్ష కోట్లతో పెట్టుబడులు పెడుతున్నాయి. మిట్టల్ ప్లాంట్ పూర్తయితే రెండు స్టీల్ ప్లాంట్లు, దేశంలోనే ఎక్కువ స్టీల్ ఉత్పత్తి చేసే జిల్లాగా ఉమ్మడి విశాఖ రికార్డు సృష్టిస్తుందన్నారు.



రాయలసీమను డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటో మొబైల్స్, డ్రోన్, శాటిలైట్ లాంచింగ్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అభివృద్ధి చేస్తాం. రాయలసీమకు బెంగళూరు, హైదరాబాద్ అనుసంధాన హైవేలు, ఎయిర్ పోర్టులు అందుబాటులో ఉంటాయి. తద్వారా లాజిస్టిక్ హబ్‌గా రాయలసీమ మారుతుంది.' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

# ఎప్పుడూ అందుబాటులో ఉంటాం.. మహిళా చట్టాలపై అవగాహనలో షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు

మెదక్, ఏప్రిల్ 28:మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు అన్నారు. ఇవాళ గజ్వేల్ సమీకృత మార్కెట్‌లో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ శ్రీరాములు మాట్లాడుతూ.. మహిళలకు భద్రత కల్పించే విషయంలో తాము ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు.

ఎలాంటి సంఘటన జరిగినా పోలీసులను ఆశ్రయించాలన్నారు. తప్పకుండా వారిపై చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో సంచరించే అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, యువత గ్రామాల్లో మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని.. అలాంటి వారిపై నిఘా పెట్టాలని అవగాహన కార్యక్రమంలో అందరికీ సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ లావణ్య, శ్రీనివాస్, మహేష్‌లు పాల్గొన్నారు.

యువకవి, రచయిత
కెపి లక్ష్మీనరసింహా
రచించిన "గాజులు కొనని రోజున" కథా సంపుటి పుస్తకావిష్కరణ

సభాధ్యక్షులు : డా॥ పసునూరి రవీందర్ (కేంద్ర సాహిత్య అకాడమి యువపురస్కార గ్రహీత)
ముఖ్య అతిథి, ఆవిష్కర్త : ప్రొ॥ కాశీం (ప్రముఖ కవి, ప్రిన్సిపాల్, ఆర్ట్స్ కళాశాల, ఉ.యూ.)
విశిష్ట అతిథులు : శ్రీ బెక్కం జనార్ధన్ (ప్రముఖ కవి, నవల రచయిత, న్యాయవాది)
ఆత్మీయ అతిథులు : శ్రీమతి కొల్లాపురం విమల (ప్రముఖ కవయిత్రి)
డా॥ సంగిశెట్టి శ్రీనివాస్ (ప్రముఖ కవి, చరిత్రకారుడు)
డా॥ వెల్దండి శ్రీధర్ (ప్రముఖ కవి, రచయిత)
పుస్తక సమీక్ష : డా॥ సిద్దెంకి యాదగిరి (ప్రముఖ కవి, రచయిత)
సమన్వయం : శ్రీ అనంతోజు మోహనకృష్ణ (ప్రముఖ కవి, రచయిత)
వందన సమర్పణ : శ్రీ పొన్నగంటి ప్రభాకర్ (ప్రముఖ యువకవి, రచయిత)

అందరికిదే మా ఆహ్వానం

తేది: 27-04-2025 ఉ॥ 10.00 గం॥లకు
వేదిక: సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్

# వేవ్స్ 2025 యానిమేషన్ ఫిల్మ్ పోటీ ఫైనల్స్ లో మెరవనున్న ఇద్దరు ఒడియా కళాకారులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:మే 1 నుంచి 4 వరకు ముంబయిలో జరగనున్న వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ (వేవ్స్ 2025) దేశంలో వర్ధమాన సృజనాత్మక ప్రతిభావంతులకు ప్రతిష్టాత్మక వేదికగా ఉపయోగపడుతుంది. వేవ్స్ ఆధ్వర్యంలో జరిగిన యానిమేషన్ ఫిల్మ్ మేకర్ కాంపిటీషన్ కు దేశవ్యాప్తంగా ఎంపికైన 42 మంది ఫైనలిస్టుల్లో ఒడిశాకు చెందిన ఇద్దరు యువ ప్రతిభావంతులు, జాజ్ పూర్ కు చెందిన భాగ్యశ్రీ సత్పతి, భువనేశ్వర్ కు చెందిన రిషవ్ మొహంతి తమదైన ముద్ర వేశారు.

ధర్మశాల, జాజ్‌పూర్‌కు చెందిన 22 ఏళ్ల చిత్ర దర్శకురాలు యానిమేషన్ కళాకారిణి అయిన భాగ్యశ్రీ సత్పతి ప్రస్తుతం అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)లో విద్యాభ్యాసం కొనసాగిస్తోంది. భారతీయ పురాణాలు, ప్రాంతీయ జానపద కథల నుంచి ప్రేరణ పొందిన భాగ్యశ్రీ సంప్రదాయ గాథలను ఆధునిక భావాలతోనూ, సాహసోపేతమైన దృశ్య భాషతోనూ పునర్నిర్మించడం ఆమె ప్రత్యేకత.

ఆమె ఫైనలిస్ట్ ప్రాజెక్ట్ 'పాసా' ఒక కాన్సెప్ట్ సిరీస్. ఇది పురాణాలను సైకాలజికల్ డ్రామాతో మిళితం చేస్తూ, మానిప్యులేషన్, లింగ, నియంత్రణ వంటి అంశాలను అన్వేషిస్తుంది. భాగ్యశ్రీ గతంలో 'హ్యాపీ బర్త్‌డే తారా' వంటి ప్రముఖ చిత్రాలకు, అలాగే ఒడిశాలోని చిల్కా సరస్సుకు చెందిన 'మా కాళి జై' ఆధారంగా ఒక డాక్యుమెంటరీ చిత్రానికి దర్శకత్వం వహించారు.

భువనేశ్వర్ కుచెందిన ఎన్ఐడీ అహ్మదాబాద్ విద్యార్థి రిషవ్ మొహంతి తన యానిమేషన్ డాక్యుమెంటరీ చిత్రం 'ఖట్టి'తో ఫైనల్స్ లో చోటు దక్కించుకున్నాడు. ఆయన పనితనం కథ, దృశ్య కథనంపై లోతైన అవగాహనను ప్రతిబింబిస్తుంది, ప్రామాణిక, ఆకర్షణీయమైన డాక్యుమెంటేషన్ కోసం ఒక మాధ్యమంగా యానిమేషన్ సామర్థ్యాన్ని ప్రముఖంగా తెలియచేస్తుంది.

వేవ్స్ 2025 లో, ఫైనలిస్టులు తమ ప్రాజెక్టులను అంతర్జాతీయ న్యాయనిర్ణేతలు, ప్రపంచ వినోద పరిశ్రమకు చెందిన ప్రముఖుల ప్యానెల్ ముందు ఉంచుతారు. ఈ పోటీ ఒక ముఖ్యమైన అవకాశాన్ని అందిస్తుంది. మొదటి ముగ్గురు విజేతలకు ఒక్కొక్కరికి రూ ఐదు లక్షల రూపాయల నగదు బహుమతి లభిస్తుంది. అంతేకాక, ఈ కార్యక్రమం భారతదేశ యానిమేషన్, వీఎఫ్ఎక్స్ పరిశ్రమ ల అపారమైన ఆర్థిక సామర్థ్యాన్ని చాటిచెబుతుంది, ఇక్కడ ఒక యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ 100 నుండి 300 మంది నిపుణులకు ఉపాధిని సృష్టించగలదు.

వేవ్స్ 2025 భారతదేశ సృజనాత్మక ప్రతిభను కేవలం ఉత్సవంగా జరపడం కాకుండా అంతర్జాతీయ భాగస్వామ్యాలను ప్రోత్సహించడం, యానిమేషన్, వినోద రంగాలలో భారత్ ను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకుంది.

తమ విలక్షణమైన కథాకథన శైలి, వినూత్న భావనలతో భాగ్యశ్రీ సత్పతి, రిషవ్ మొహంతి జాతీయ వేదికపై ఒడిశాకు గర్వకారణంగా నిలవనున్నారు.

# సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'ఇండియా: ఎ బర్డ్స్ ఐ వ్యూ ఛాలెంజ్'ను విజయవంతంగా నిర్వహించిన బీఈసీఐఎల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:భారత్‌లో ఎ బర్డ్స్ ఐ వ్యూ ఛాలెంజ్ నిర్వహణ, మేనేజింగ్ బాధ్యతలను సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని మినీ రత్న ప్రభుత్వ రంగ సంస్థ అయిన బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) కు అప్పగించారు.

ఈ పోటీల్లో పాల్గొనేవారు ఆకర్షణీయమైన డ్రోన్ సినిమాటోగ్రఫీ ద్వారా భారతదేశ సౌందర్యం, వివిధ ప్రదేశాలు, వారసత్వం, సంస్కృతి, ఆవిష్కరణలు, పురోగతి, పరివర్తనను ప్రధానంగా ప్రదర్శిస్తూ 2-3 నిమిషాల వీడియోలను సమర్పించాల్సి ఉంటుంది. సమ్మిళిత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, ఈ ఛాలెంజ్‌లో కింది రెండు కేటగిరీలను చేర్చారు:

ఓపెన్ కేటగిరీ: చిత్రనిర్మాతలు, విద్యార్థులు, అభిరుచి గలవారు, వృత్తి నిపుణులు, డ్రోన్ ఔత్సాహికులు సహా భారతీయ పౌరులందరూ పాల్గొనడానికి అవకాశం ఉంటుంది.

డ్రోన్ దీదీ కేటగిరీ: డ్రోన్ నిర్వహణలో శిక్షణ ద్వారా గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో మహిళలకు సాధికారత కల్పించే లక్ష్యంతో ప్రారంభించిన నమో డ్రోన్ దీదీ పథకం వంటి కార్యక్రమాల ద్వారా శిక్షణ పొందిన మహిళలకు మాత్రమే పాల్గొనే అవకాశం ఉంటుంది.

విస్తృత అవగాహనను కల్పించడానికి, భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, సాంప్రదాయిక, డిజిటల్ అవుట్‌రీచ్ పద్ధతుల సమ్మేళనంతో బీఈసిఐఎల్ ఒక సమగ్ర జాతీయ మీడియా ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ఈ ప్రచారంలో భాగంగా భారతదేశంలోని అన్ని డ్రోన్ అకాడమీలు, మీడియా సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో సంస్థాగత సందర్శనలు, సెమినార్లు నిర్వహించడంతో పాటు, ప్రాథమిక స్థాయి నుంచి అందరి భాగస్వామ్యం ఉండేలా విద్యార్థులు, డ్రోన్ శిక్షణ తీసుకుంటున్న వారితో ప్రత్యక్ష సంభాషణలు నిర్వహించారు. రిజిస్ట్రేషన్, వీడియో సమర్పణను సులభతరం చేయడానికి ఒక ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభించారు. అంతేగాకుండా, ప్రచార డిజిటల్ ప్రయత్నాలను విస్తరిస్తూ మీడియా పాఠశాలలు, డ్రోన్ శిక్షణా కేంద్రాలు, పౌర సమాజ నెట్‌వర్క్‌లు లక్ష్యంగా వ్యూహాత్మక ఇమెయిల్ ప్రచారాలను నిర్వహించారు. ఈ పోటీల పట్ల నిరంతరం ఆసక్తిని పెంపొందించేలా అనుకూలీకరించిన కంటెంట్‌తో ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, లింక్డ్‌ఇన్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను విస్తృతంగా ఉపయోగించారు. డిజిటల్ ప్రయత్నాలకు అనుబంధంగా, పోస్టర్లు, కరపత్రాలు సహా ముద్రిత సామగ్రిని పంపిణీ చేశారు.

ఈ పోటీలకు డ్రోన్ దీదీ అభ్యర్థుల నుంచి వచ్చిన 382 ఎంట్రీలు సహా అత్యధికంగా మొత్తం 1,324 రిజిస్ట్రేషన్లు వచ్చాయి, కథ చెప్పే మాధ్యమంగా డ్రోన్ వీడియోగ్రఫీ పట్ల పెరుగుతున్న మక్కువను ఇది ప్రతిబింబిస్తోంది. హిమాచల్ ప్రదేశ్‌లోని హిమాలయ లోయల నుంచి ఉత్తరప్రదేశ్‌లోని సాంస్కృతిక కారిడార్లు, బీహార్ మైదానాలు, గుజరాత్, కర్ణాటకలోని ఆవిష్కరణ కేంద్రాలు, తమిళనాడు తీరప్రాంతాల వరకు భారతదేశ నలుమూలల నుంచి ఎంట్రీలు వెల్లువెత్తాయి తద్వారా ఈ పోటీలు భారతదేశ స్థాయి సృజనాత్మక, పురోగతి వేడుకలుగా మారాయి.

కచ్చితమైన మూల్యాంకన ప్రక్రియ తర్వాత, సామాజిక ప్రాతినిధ్యం కోసం ప్రత్యేక కేటగిరీ కింద నాలుగు ఎంట్రీలు సహా ప్రతి కేటగిరీ నుంచి ఐదుగురు ఫైనలిస్టులను ఎంపిక చేశారు:

మీడియా & వినోదం (ఎమ్ & ఈ) రంగం కోసం కీలకమైనది అయిన మొదటి వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమిట్ (వేవ్స్) భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో మే 1 నుంచి 4వ తేదీ వరకు మహారాష్ట్రలోని ముంబయిలో జరగనుంది.

పరిశ్రమ నిపుణులు, పెట్టుబడిదారులు, క్రియేటర్ లేదా ఆవిష్కర్తలను ఎమ్ ఌ ఈ రంగానికి అనుసంధానించడానికి, సహకరించడానికి, ఆవిష్కరణలు చేయడానికి, తోడ్పాటునందించడానికి ఈ సమిట్ ఒక తిరుగులేని ప్రపంచస్థాయి వేదికను అందిస్తుంది.

భారత సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి, కంటెంట్ క్రియేషన్, మేధో సంపత్తి, సాంకేతిక ఆవిష్కరణల కేంద్రంగా భారత్ స్థానాన్ని విస్తృతం చేసే లక్ష్యంతో వేవ్స్ రూపుదిద్దుకుంది. బ్రాడ్‌కాస్టింగ్, ప్రింట్ మీడియా, టెలివిజన్, రేడియో, ఫిల్మ్స్, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, సౌండ్ అండ్ మ్యూజిక్, అడ్వర్టైజింగ్, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, జనరేటివ్ ఏఐ, ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), వర్చువల్ రియాలిటీ (వీఆర్), ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (ఎక్స్ఆర్) వంటి పరిశ్రమలు, రంగాలపై ఇది దృష్టి సారించింది.

# నర్సన్న చెంత హరినామ సంకీర్తనకు అడ్డంకులేల?

### -తగు సౌకర్యాలు కల్పించాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విజయశంకర స్వామి డిమాండ్

### - సాధనకు మే 7న హైదరాబాద్ లో భారీ ఎత్తున భక్తులతో సమ్మేళనం

### - వైకుంఠ ద్వారం వద్ద స్వామి పాదాల చెంత గోడ పత్రికల ఆవిష్కరణ

### -మే 7 న హైదరాబాద్ లో హైందవ భక్తి కళా సమ్మేళనం

యాదగిరిగుట్ట ఏప్రిల్ 28 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కొలువైన యాదగిరిగుట్ట కొండపైన స్వామి సన్నిధిలో ప్రతి నిత్యం అఖండ హరినామ సంకీర్తన ఆలాపన కోసం భక్తులకు అనుమతి, నిర్వహణ కు ఏదేని మండపం, స్వామి దర్శనం, ఉచిత బస (గదులు), అన్నప్రసాదం



వంటి సౌకర్యాలు కల్పించాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విజయశంకర స్వామి శనివారం ప్రభుత్వానికి, దేవస్థానం అధికారులకు విజ్ఞప్తి చేశారు. తొలుత పట్టణం లో కాలినడకన వైకుంఠ ద్వారం వద్దకు వచ్చి స్వామి పాదాల చెంత మే 7 న హైదరాబాద్ లో నిర్వహించ తలపెట్టిన సమ్మేళన గోడపత్రికను భక్తులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ సంకీర్తన ల కోసం గత మూడు సంవత్సరాలుగా ఎంతగా విజ్ఞప్తి చేసినా ఇటు యాదగిరిగుట్ట దేవస్థానం అధికారులు గాని, అటు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ గానీ సానుకూలంగా స్పందించ లేదన్నారు. ఆగమ శాస్త్రం ప్రకారం సంకీర్తనలకు తిరుమల తిరుపతి లో ఏడాది పొడవునా 365 రోజులు అవకాశం, సౌకర్యాలు కల్పించారని, అదే పద్ధతిలో యాదగిరిగుట్ట తో సహా రాష్ట్రంలోని అన్ని దేవాలయాలలో కూడా ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు.

మే 7 న హైదరాబాద్ లో హైందవ భక్తి కళా సమ్మేళనం

మే 7 న హైదరాబాద్ లో నిర్వహించ తలపెట్టిన హైందవ భక్తి కళా సమ్మేళనాన్ని అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నమయ్య కళాక్షేత్రం యాదగిరిగుట్ట కన్వీనర్ శిఖ గణేశ్ ఈ సందర్భంగా భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ (ఊఖఇ) అధికార ప్రతినిధి ఖాది జ్ఞాసి మల్లికా వల్లభ, అన్నమయ్య కళాక్షేత్రం అధికార ప్రతినిధి బాలసుబ్రమణ్యం, అన్నమయ్య గృహ సాధన సమితి ప్రధాన కార్యదర్శి లక్ష్మేశ్వర్ దున్న, జై భారత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఖాది జ్ఞాసి రాజు, భజన గురువు, ఎర్ర బాలయ్య,, కంకల సిద్ధులు, రచ్చ లక్ష్మి, మిరియాల లక్ష్మి, రచ్చ హేమలతతో సహా జానపద భక్తి కళా గురువులు, కళాకారులు, భక్తులు పాల్గొన్నట్లు శిఖ గణేశ్ తెలిపారు.

# చారిత్రాత్మక కేన్స్ 2025 కు ఎంపికైన ఎస్ఆర్ఎఫ్‌టీఐ చిత్రం "ఎ డాల్ మేడ్ అప్ ఆఫ్ క్లే"

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్స్టిట్యూట్ (ఎస్ఆర్ఎఫ్‌టీఐ) విద్యార్థి తీసిన చిత్రం "ఎ డాల్ మేడ్ అప్ ఆఫ్ క్లే" 2025కు సంబంధించిన 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోని ప్రతిష్టాత్మక లా సినీఫ్ విభాగంలో అధికారికంగా ఎంపికైంది. ఈ విభాగంలో ఎంపికైన ఏకైక భారతీయ చిత్రం ఇదే. ఈ సంఘటన భారత సినిమా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది.

భారత్‌లో వృత్తిపరంగా ఫుట్‌బాల్ క్రీడాకారుడు కావాలనే తన కలను సాకారం చేసుకునేందుకు ఓ యువ నైజీరియన్ అథ్లెట్ తన తండ్రి భూమిని అమ్మేస్తాడు. అయితే ఆతనికి అయిన గాయం ఆటకు వీడ్కోలు పలికేలా చేస్తుంది. దీనితో నిరాశ చెందుతాడు. అంతేకాకుండా తనకు తెలియని దేశంలో చిక్కుకుపోయి ఉంటాడు. శారీరకంగా బాధ పడుతున్న అతను మానసికంగా కూడా గాయం వల్ల తీవ్ర భావోద్వేగంలో ఉంటాడు. గుర్తింపు పరంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటూ అతను.. తన పూర్వీకుల ఆధ్యాత్మిక సంప్రదాయాలతో తిరిగి సంబంధం ఏర్పరచుకుంటాడు. భావోద్వేగం నుంచి విమోచన పొంది, జీవిత అర్థాన్ని కనుగొంటాడు. ప్రాంతాలు మారటం, నష్టం, సాంస్కృతిక దృఢత్వాన్ని గురించి తెలియజేసే చిత్రమే 'ఎ డాల్ మేడ్ ఆఫ్ క్లే'.ఎస్ఆర్ఎఫ్‌టీఐకు చెందిన పీఎఫ్‌టీ (ప్రొడ్యూసింగ్ ఫర్ ఫిల్మ్ అండ్ టెలివిజన్) విభాగం ఆధ్వర్యంలో నిర్మించిన ఈ 23 నిమిషాల ప్రయోగాత్మక చిత్రం వివిధ దేశాల మధ్య సహకారాన్ని తెలియజేస్తోంది. ఐసీసీఆర్ ఆఫ్రికన్ ఉపకారం వేతనం కింద ఇథియోపియా విద్యార్థి కోకోబ్ గెబ్రెహే టెస్ఫే దర్శకత్వం వహించిన ఈ చిత్రం పీఎఫ్‌టీ విద్యార్థి సాహిల్ మనోజ్ ఇంగ్లే నిర్మించారు. ఈ చిత్రం ప్రపంచ సినిమా సృజనాత్మకత విషయంలో ఎస్ఆర్ఎఫ్‌టీఐ అంకితభావాన్ని ప్రధానంగా వ్యక్త పరుస్తోంది.

కేన్స్‌లోని లా సినీఫ్‌లో పోటీ పడటానికి ఆహ్వానం అందుకున్న ఈ చిత్రం ప్రపంచ స్థాయి ఫిల్మ్ స్కూల్‌లోని వర్ధమాన ప్రతిభను తెలియజేస్తోంది. ఈ చిత్రోత్సవం మే నెలలో ఫ్రాన్స్‌లో జరుగనుంది.ఎస్ఆర్ఎఫ్టీఐ డీన్ ప్రొఫెసర్ సుకాంత మజుందార్ మాట్లాడుతూ "మా విద్యార్థుల ఏదైనా సిని కళను ప్రతిష్ఠాత్మక ప్రపంచ స్థాయి సంస్థలు గుర్తించినప్పుడు అది మాకు ధైర్యాన్ని ఇస్తుంది. ఇది మాకు చాలా గర్వకారణం. మా విద్యార్థులను చూసి మేం చాలా గర్విస్తున్నాం. పోటీలో వారు రాణించాలని కోరుకుంటున్నాను" అన్నారు.

# లక్షల సంఖ్యలో హాజరై సభను సక్సెస్ చేసిన అందరికీ ధన్యవాదాలు -కెటిఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 28: తెలంగాణ రాష్ట్రంపై, మాజీ సీఎం కేసీఆర్ పై అచంచల విశ్వాసాన్ని చూపిస్తూ.. అపూర్వమైన సంఖ్యలో ఎల్కతుర్తికి హాజరై బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభను విజయవంతం చేసినందుకు అందరికీ దన్యవాదాలు తెలిపారు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ . ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. దేశ చరిత్రలో అతిపెద్ద రాజకీయ సమావేశాలలో ఒకటైన బీఆర్ఎస్ రజతోత్సవ సమావేశాన్ని జాగ్రత్తగా ప్లాన్ చేసి, ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించామన్నారు.రాష్ట్ర పోలీసుల ట్రాఫిక్ నిర్వహణ లోపం కారణంగా లక్షలాది మంది వేదిక వద్దకు చేరుకోలేకపోయారని అన్నారు.. అయినప్పటికీ , బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు తమ శక్తిని ఈ సమావేశంలో ద్వారా నిరూపించామన్నారు. ఈ కార్యక్రమాన్ని నిజంగా చారిత్రాత్మకమైనదిగా, అద్భుతమైన విజయంగా మార్చినందుకు తెలంగాణ ప్రజలు, నిర్వాహకులు, బిఆర్ ఎస్ నాయకులు, క్యాడర్, సోషల్ మీడియా యోధులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు కెటిఆర్ . అద్భుతమైన కవరేజ్ ఇచ్చిన మీడియా సోదరులకు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు.

# ఈపీడీసీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా శ్రీదేవి రాజేశ్వరి నియామకం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఎక్స్ ప్రెస్ న్యూ స్)(;);కాకినాడ పట్టణానికి చెందిన ప్రముఖ సేవా సంస్థ "శ్రీ చారిటబుల్ ట్రస్ట్" అధ్యక్షురాలు వి. శ్రీదేవి రాజేశ్వరి ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ (ఈపీడీసీ) జాతీయ ఉపాధ్యక్షురాలిగా నియమితుల య్యారు. ఈ మేరకు ఈపీడీసీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. రాజేశ్వరి గత కొన్నేళ్లుగా శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, మహిళా సాధికారత వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తు న్నారు. అంతేకాకుండా, పర్యావరణ పరిరక్షణ పట్ల ఆమెకు ప్రత్యేకమైన శ్రద్ధ, ఆసక్తి ఉన్నాయి. ఈ అంశాలను పరిగణలోకి తీసుకున్న ఈపీడీసీ ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ గిడ్డా శ్రీనివాస నాయుడు ఆమె పేరును జాతీయ ఉపాధ్యక్ష పదవికి సిఫారసు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీహెచ్ రంగయ్య మాట్లాడతూ...శ్రీదేవి రాజేశ్వరి నిస్వార్థ సేవా దృక్పథం, పర్యావరణ పరిరక్షణ పట్ల ఆమెకున్న నిబద్ధత సంస్థకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న రెండేళ్ల పాటు ఆమె ఈ కీలక బాధ్యతల్లో కొనసాగుతారని తెలిపారు. కాగా తన నియామకం పట్ల శ్రీదేవి రాజేశ్వరి కృతజ్ఞతలు తెలియ చేశారు. ఈపీడీసీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా తనకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వహిస్తానని ఆమె పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. తన నియామకానికి సహకరించిన ఈపీడీసీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య, ఏపీ కన్వీనర్ గిడ్డా శ్రీనివాస నాయుడు మరియు ఇతర సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# వ్యవసాయ మార్కెట్ లో దారుణ హత్య

పెద్దపల్లి, ఏప్రిల్ 28: వ్యవసాయ మార్కెట్లో దారుణ హత్య జరిగింది. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన పొలం కుమార్ ను ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన వేల్పుల సంతోష్ కత్తితో మెడపై పొడిచి దారుణంగా హత్య చేశాడు.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. నిందితుడితో పాటు ఓ మహిళను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్ కు తరలించారు. హత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని భావిస్తున్నారు.

# కేర్ హాస్పిటల్స్ లో ఘనంగా ది రోబోటిక్ ఎడ్జ్ 2025'

### –శస్త్రచికిత్సల ఖచ్చితత్వం లో భవిష్యత్తు దిశను చూపించిన ప్రత్యేక కాన్ఫరెన్స్




హైదరాబాద్, ఏప్రిల్ 28, (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్ ఆధ్వర్యంలో 'ది రోబోటిక్ ఎడ్జ్ 2025' పేరుతో ఒక ప్రత్యేక క్లినికల్ కాన్ఫరెన్స్ ను హైదరాబాద్ మారియట్ హోటల్ అండ్ కన్వెన్షన్ సెంటర్ లో ఘనంగా నిర్వహించారు. దేశం నలుమూలల నుండి వచ్చిన వైద్య నిపుణులు, ఆరోగ్య రంగ ప్రముఖులు, టెక్నాలజీ పరిశ్రమ నిపుణులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నా, గౌరవ అతిథులు ప్రముఖ నటి శ్రీమతి ప్రియాంక జవాల్కర్ మరియు ప్రముఖ దర్శకుడు శ్రీ వెంకీ అట్లూరి లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ బాబు, సీనియర్ కార్డియాలజిస్ట్ ఌ మేనేజింగ్ డైరెక్టర్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్, ఆంధ్రప్రదేశ్; గ్రూప్ సిఎఫ్ఓ విశాల్ మహేశ్వరి, గ్రూప్ సిఐఓ వినోద్ రామన్, కేర్ హాస్పిటల్స్ గ్రూప్ చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ నిఖిల్ మాథుర్, జోనల్ సీఓఓ బిజు నాయర్, జోనల్ ఎవిపి ఌ మెడికల్ హెడ్ డాక్టర్ అజిత్ సింగ్ పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో రోబోటిక్ శస్త్రచికిత్స పద్ధతులను ప్రత్యక్షంగా చూపించారు. నిపుణులు వివిధ విభాగాల్లో రోబోటిక్స్ ఉపయోగాన్ని వివరించారు. కృత్రిమ మేధస్సు (ఐఎ) వల్ల ఆరోగ్య రంగంలో వచ్చే మార్పులపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ నిఖిల్ మాథుర్ "కేర్ హాస్పిటల్స్‌లో రోబోటిక్స్‌ను మా వైద్య సేవల ముఖ్యమైన భాగంగా చూస్తున్నాం. ఇది శస్త్రచికిత్సలు ఇంకా ఖచ్చితంగా జరిగేలా చేసి, చికిత్సల ఫలితాలను మెరుగుపరచడమే కాక, రోగుల అనుభవాన్ని కూడా మెరుగుపరుస్తోంది. మేము కేవలం కొత్త టెక్నాలజీని తీసుకురావడమే కాదు, రోగి కేంద్రిత సంరక్షణకు ఉన్న అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తూ ప్రతి మార్పును కూడా తీసుకువస్తున్నాం" అని తెలిపారు. జోనల్ సీఓఓ బిజు నాయర్ మాట్లాడుతూ, "మా డాక్టర్లందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. వారు కొత్త సాంకేతికతలను స్వీకరించి, ఆరోగ్య రంగంలో మార్పుకు ముందుండి దారిచూపిస్తున్నారు. నూతన టెక్నాలజీకి అనుగుణంగా తమ విధానాలను మారుస్తూ ముందుకు సాగుతున్నారు. వారి నిరంతర ప్రయత్నాల వల్ల మా రోగులకు ప్రపంచంలోనే ఉత్తమమైన ఆరోగ్య సేవలు అందడం సాధ్యమవుతోంది" అని చెప్పారు.ఈ సదస్సులో నిపుణులు వివిధ విభాగాల్లోని మరిన్ని అంశాలను వివరణ ఇచ్చారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, కేర్ వత్సల్య ఉమెన్ అండ్ చైల్డ్ ఇన్‌స్టిట్యూట్ లో క్లినికల్ డైరెక్టర్ మరియు హెచ్ఓడి డాక్టర్ మంజుల అనగానీ రోబోటిక్ గైనకాలజీ గురించి మాట్లాడారు. కేర్ హాస్పిటల్స్ లో క్లినికల్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ ఌ హెచ్ఓడి - యూరాలజీ డాక్టర్ పి. వంశీ కృష్ణ రోబోటిక్, లాపరోస్కోపీ ఌ ఎండోయురాలజీ సర్జరీ గురించి వివరించారు. సీనియర్ కన్సల్టెంట్ ఌ హెడ్ డాక్టర్ సతీష్ పవర్ సర్జికల్ ఆంకాలజీ ఌ రోబోటిక్ సర్జరీ పై తన అభిప్రాయాలను పంచుకున్నారు. అలాగే, సీనియర్ కన్సల్టెంట్ జిఐ లాపరాస్కోపిక్ డాక్టర్ వేణుగోపాల్ పరిక్ బారియాట్రిక్ ఌ రోబోటిక్ సర్జరీ గురించి వివరించారు.

# ఆపరేషన్ కగార్ నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి: జస్టిస్ చంద్రకుమార్




హైదరాబాద్, ఏప్రిల్ 28: ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని శాంతి చర్చల కమిటీ కన్వీనర్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపకుండానే ఆదివాసీలపై దమనకాండకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇది సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదివాసీల హననాన్ని తక్షణమే ఆపేయాలని కోరారు. విలువైన ఖనిజ వనరులను దేశ విదేశీ వాణిజ్య సామ్రాజ్యవాదులు, కార్పొరేట్లతో ఒప్పందాలు చేసుకొని, వారికి అప్పజెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. అందులో భాగంగానే ఆదివాసీలు, వారికి అండగా ఉన్న మావోయిస్టులను అంతం చేసే కుట్ర జరుగుతోందని దుయ్యబట్టారు. ఇరువర్గాలు కాల్పుల విరమణ పాటించి, శాంతి చర్చల వైపు ప్రయత్నాలు చేయాలని సూచించారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులను కాలరాస్తూ పెసా,1/70 చట్టాలను తుంగలో తొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీల రాజ్యాంగ హక్కులను కాపాడాలని కోరారు. శాంతి చర్చల కమిటీ ఉపాధ్యక్షులు జంపన్న మాట్లాడుతూ.. ఆదివాసీల సంక్షేమం దృష్ట్యా ఇరుపక్షాలు శాంతిని పాటించాలని కోరారు.

# పోస్టాఫీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



హైదరాబాద్, ఏప్రిల్ 28:పోస్టాఫీసు సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తాండూరు పోస్టాఫీసు సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం చౌడాపూర్ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామం లో పోస్టాఫీసు నూతన బ్రాంచిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీసు సేవలను మరిం సులభతరం చేసేందుకు ముజాహిద్‌పూర్ పోస్టాఫీసు పరిధిలోని ఆరు గ్రామాలను కలుపుతూ నూతన పోస్టాఫీసు లింగంపల్లిలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మారుతున్న ప్రజా అవసరాలకు అనుగుణంగా పోస్టాఫీసులు ఆర్థిక, బీమా, ఆధార్, ఐపీబీబీ వంటి ఎన్నో సేవలను అందిస్తుందని అన్నారు. ప్రజలు పోస్టాఫీసు సేవలను మరింతగా ఉపయోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో లింగంపల్లి గ్రామ ప్రత్యేక అధికారి రమేశ్, పంచాయతీ కార్యదర్శి రాధ, బస్ ఫోస్ట్ మాస్టర్ సాయి, మేయిల్ ఓవర్సీస్ రమేశ్, పోస్టల్ సిబ్బంది, గ్రామనాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

